# శ్రీశైలం ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు

అచ్చంపేట, మొంథా తుఫాను ప్రభావంతో నిన్ని రాత్రి నల్లమల అటవీ పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో శ్రీశైలం డ్యామ్ ఘాట్ రోడ్డుపై భారీ కొండచరియలు విరిగిపడి రహదారి మధ్యలో పడ్డాయి. దీన్ని ఫలితంగా హైదరాబాద్-శ్రీశైలం మధ్య రహదారి రవాణా పూర్తిగా నిలిచిపోయింది. స్థానిక పోలీసులు, అటవీ శాఖ అధికారులు కలిసి ప్రమాద ప్రాంతాన్ని మూసివేశారు. రహదారిపై పడిన రాళ్లను తొలగించేందుకు జేసీబీల సాయంతో క్లియరెన్స్ పనులు వేగంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.లింగాలగట్టు చెక్‌పోస్ట్ సమీపంలో వాగు ఉప్పొంగి ప్రవహించడం వల్ల చెక్‌పోస్ట్ భవనం పాక్షికంగా కోతకు గురైనట్టు సమాచారం. వర్షపాతం తీవ్రత దృష్ట్యా శ్రీశైలం దిశగా ప్రయాణించే భక్తులు, పర్యాటకులు అత్యవసర పరిస్థితులు మినహా రాకపోకలు నిలిపివేయాలని పోలీసులు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులు స్థిరపడే వరకు శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రయాణం చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :212 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 30-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## జూబ్లీహిల్స్ లో 'జూబ్లీహిల్స్' లేదే..?




హైదరాబాద్,హైదరాబాద్ మహానగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఉప ఎన్నిక జరుగుతోంది. హైదరాబాద్ నగర పరిధిలో మొత్తం 29 అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఇందులో జూబ్లీహిల్స్ ఒకటి కాగా, ఈ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జూబ్లీహిల్స్ మున్సిపల్ డివిజన్ లేకపోవడం గమనార్హం. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 6 డివిజన్లు ఉన్నాయి. ఇందులో అత్యంత సంపన్నులు ఉండే జూబ్లీహిల్స్ డివిజన్ లేదు. అయినప్పటికీ ఈ నియోజకవర్గానికి జూబ్లీహిల్స్ పేరు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2009లో జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు ఈ నియోజకవర్గం ఖైరతాబాద్ అసెంబ్లీ పరిధిలో ఉండేది. హైదరాబాద్ నగరంలోని మాస్, క్లాస్ ప్రజలు నివసించే ప్రాంతాలతో కలిపి జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఎర్రగడ్డ, బోరబండ, యాసుఫ్ గూడ, వెంగళరావునగర్, రెహమత్నగర్, షేక్ పేట డివిజన్లు కలిపారు. అయితే ఈ డివిజన్లకు జూబ్లీహిల్స్ ప్రాంతంతో సంబంధం లేకపోయినా అసెంబ్లీ నియోజకవర్గానికి జూబ్లీహిల్స్ పేరు పెట్టడం అంతుబట్టడం లేదు. జూబ్లీహిల్స్ అంటేనే నగరంలోని సంపన్నులు నివసించే ప్రాంతం. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నిక అనగానే అంతా సంపన్నులు ఉంటారని భావిస్తారు. కానీ, ఈ నియోజకవర్గం పరిధిలో పెద్దగా సంపన్నులు నివాసం ఉన్న దాఖలాలు కనిపించడం లేదు. పేదలతోపాటు మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి జనం మాత్రమే ఎక్కువగా నివసిస్తున్నారు. అదేవిధంగా మైనార్టీ ఓటర్లు భారీగానే ఉన్నారు. నిజానికి జూబ్లీహిల్స్ అంటే వీవీఐపీలే అందరికీ గుర్తుకు వస్తారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాలు ఉన్నాయి. అదేవిధంగా సినీ సెలబ్రిటీలు చిరంజీవి, బాలకృష్ణ, మహేష్ బాబు, అల్లు అర్జున్, నాగార్జున, వెంకటేశ్ తో చాలా మంది సెలబ్రిటీలు జూబ్లీహిల్స్ లోనే నివసిస్తున్నారు. ఉభయ రాష్ట్రాలకు చెందిన చాలా మంది రాజకీయ నేతల నివాసాలు, పారిశ్రామికవేత్తల బంగ్లాలకు జూబ్లీహిల్స్ చిరునామా. అయితే ఉప ఎన్నిక జరుగుతున్న జూబ్లీహిల్స్ లో ఏ ఒక్క సెలబ్రెటికి ఓటు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే జూబ్లీహిల్స్ లో సినీ సెలబ్రెటీలు ఎవరికీ ఓటు లేకపోయినా, సినీ ఇండస్ట్రీలో పనిచేస్తున్న వేల మంది కార్మికులకు ఓట్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే యూసుఫ్ గుడ, రెహమత్ నగర్, వెంగళరావునగర్ పరిధిలో దాదాపు 24 వేల మంది సినీ కార్మికులు నివసిస్తున్నారు. వీరందరికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఓట్లు ఉన్నాయి. దీంతో జూబ్లీహిల్స్ తీర్పులో సినీ కార్మికులు కీలకంగా చెబుతున్నారు. మరోవైపు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈ డివిజన్ లేకపోవడంతో ఇక్కడ నివసించే ప్రముఖులు, సంపన్నులు, సెలబ్రెటీలకు ఎక్కడ ఓట్లు ఉన్నాయనే అంశం కూడా ఆసక్తి రేపుతోంది. అయితే జూబ్లీహిల్స్ డివిజన్ ఖైరతాబాద్ అసెంబ్లీ పరిధిలోకి వస్తుంది. దీంతో ప్రముఖులు అందరి ఓట్లు ఆ అసెంబ్లీ పరిధిలో నమోదు అయినట్లు రికార్డులు చెబుతున్నాయి.

## తెలంగాణపైకి దూసుకొస్తున్న 'మొంథా' తుపాన్

హైదరాబాద్ : ఏపీని వణికించిన 'మొంథా' తుపాన్ అనూహ్యంగా దిశ మార్చుకుని తెలంగాణపైకి దూసుకొస్తుంది. అర్ధరాత్రి నర్సాపురం వద్ద తీరం దాటిన మొంథా తుపాన్ తీవ్ర వాయుగుండంగా మారి బలహీనపడుతున్న క్రమంలో అనూహ్యంగా దిశ మార్చుకుని అల్పపీడనంగా మారి తెలంగాణ రాష్ట్రంపైకి దూసుకొస్తుంది. వాయువ్యదిశగా ప్రయాణించి వచ్చే ఆరు గంటల్లో అల్పపీడనంగా మారనున్న మొంథా తుపాన్ ప్రభావంతో తెలంగాణలో 24గంటల పాటు భారీ వర్షాలు కురవనున్నాయి. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. తీరం దాటాక దిశ మార్చుకున్న మొంథా తుఫాన్ బలహీనపడి భద్రాచలంకు 50 కిలోమీటర్లు..ఖమ్మంకు 110 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. వచ్చే ఆరు గంటల్లో అల్పపీడనంగా ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో 12జిల్లాలకు ఆరెంజ్, 9జిల్లాలకు ఎల్లో అలర్ట్, 3జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకంటించారు. ఇప్పటికే యాద్రాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడురులో 9సెంటిమీటర్ల వర్షం పడింది. రాష్ట్రంలోని నదులు, వాగులు పొంగిపోర్లుతున్నాయ. హైదరాబాద్ నగరంలో వర్షం దంచి కొడుతుంది. ఖమ్మం, పాలేరు, భద్రాచలం, సత్తుపల్లిలో భారీ వర్షం పడుతుంది. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వే స్టేషన్ చెరువును తలపిస్తుంది. రైల్వేస్టేషన్‌లో రైలు పట్టాలపై వరద నీరు చేరి పట్టాలు మునిగిపోవడంతో డోర్నకల్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్



రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేశారు.

**జంట జలాశయాల గేట్లు తెరిచిన జలమండలి అధికారులు**

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో వరద ఉధృతి పెరుగడంతో జల మండలి అధికారులు ఉస్మాన్‌సాగర్(గండిపేట) పది గేట్లను రెండు అడుగుల మేర, హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. మంచిరేవుల కల్వర్టుపై నుంచి వరద నీరు పారుతుండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. హిమాయత్‌సాగర్ ప్రస్తుత నీటిమట్టం 1762.25 అడుగులు, ఉస్మాన్‌సాగర్ ప్రస్తుత నీటిమట్టం 1788.85 అడుగులుగా ఉంది. జంట జలశయాల నుంచి వస్తున్న వరద నీటితో పాటు భారీ వర్షాలు వరదలతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తుంది.

## ఢిల్లీలో మేఘ మథనం విఫలం.. ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా దీపావళి పండుగ తర్వాత గాలి నాణ్యత క్షీణించింది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన 'మేఘ మథనం' విఫలమైన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత చాలా పేలవమైన విభాగంలో నమోదైంది.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు.. బుధవారం ఉదయం ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచిక 300 కంటే ఎక్కువగానే నమోదైంది. ఆనంద్ విహార్ అబ్జర్వేటరీలో ఏక్యూఐ లెవెల్స్ 312గా నమోదయ్యాయి. ఐటీవో, అక్షర్ ధామ్ వద్ద ఏక్యూఐ 307గా, ఇండిగా గేట్ వద్ద 282గా గాలి నాణ్యత సూచీ నమోదైంది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. దాదాపు 53 ఏండ్ల తర్వాత ఢిల్లీలో కాలుష్య స్థాయిలను పెంచేందుకు క్లౌడ్ సీడింగ్ నిర్వహించింది. ఐఐటీ కాన్పూర్ సహకారంతో బురారి, ఉత్తర కరోల్ బాగ్, మయూర్ విహార్, బద్లి సహా పలు ప్రాంతాల్లో



ట్రయల్స్ నిర్వహించింది. ప్రయోగానికి ఉపయోగించిన విమానం కాన్పూర్ నుంచి బయల్దేరి 6,000 అడుగుల ఎత్తులో రసాయనాలను వెదజల్లింది. అయితే, ఈ ప్రయత్నం విఫలమైంది. ప్రక్రియ పూర్తయి నాలుగు గంటలైనా వర్షాలు కురవకపోవడం అందరినీ నిరుత్సాహపర్చింది.

## కవిత రాజీనామాను ఆమోదించాలని బీఆర్ఎస్ ఎందుకు కోరట్లేదు?



హైదరాబాద్,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయగా ఇంకా ఆమోదం పొందకపోవడం రాజకీయంగా రచ్చరేపుతోంది. కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ లీక్..ఆ తర్వాత పార్టీనేతలపై ఆమె చేసిన ఆరోపణలతో కవితను బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసింది. ఆ వెంటనే కవిత కూడా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రిజైన్ చేశారు. సెప్టెంబర్ 3న కవిత తన ఎమ్మెల్సీ పదవికి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేశారు. అదే రోజు శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. అంతే కాకుండా మండలి ఛైర్మన్‌తోనూ కవిత ఫోన్‌లో మాట్లాడి..తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని కోరారు. ఈ విషయాన్ని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా ధ్రువీకరించారు. కవిత ఎమోషనల్‌గా రాజీనామా నిర్ణయం తీసుకున్నారని, పునరాలోచించుకోవాలని ఆమెను కోరినట్లు కూడా చెప్పారు. కవిత రాజీనామాపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని మండలి ఛైర్మన్ చెప్పి కూడా నెల రోజులు దాటిపోవడంతో ఇప్పుడు కవిత రాజీనామా చుట్టూ రాజకీయ రచ్చ మొదలైంది. సాధారణంగా అయితే అధికార పక్షం నుంచి ఎవరైనా ఎమ్మెల్యేలు లేదంటే ఎమ్మెల్సీలు రాజీనామా చేస్తే చాలాకాలం పెండింగ్లో పెట్టడం సర్వసాధారణం. కానీ ప్రతిపక్ష, విపక్షాల నుంచి ఇలా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామాలు వస్తే స్పీకర్ గాని, మండలి ఛైర్మన్ గాని వెంటనే రాజీనామాలకు ఆమోదం తెలపడం జరుగుతుంది. కానీ బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కవిత..తమ పదవికి రాజీనామా చేసి రెండు నెలలు కావొస్తున్నా ఇంకా ఎందుకు ఆమోదం పొందడం లేదన్నది రాజకీయవర్గాల్లో సాగుతున్న చర్చ. కవిత రాజీనామా ఆమోదం పొందకపోవడం వెనుక ఆంతర్యం ఏంటన్న చర్చ బీఆర్ఎస్‌లోనూ జరుగుతోంది.

**మండలి ఛైర్మన్‌ను సంప్రదించాలని ప్రయత్నించినప్పటికీ..**

కవిత స్పీకర్ ఫార్మాట్లో రాజీనామా చేసి, ఆ తర్వాత మండలి ఛైర్మన్‌తో ఫోన్లో మాట్లాడి తన రిసిగ్నేషన్‌ను ఆమోదించాలని కోరినా ఎందుకు ఆమోదానికి నోచుకోవడం లేదన్నదే చర్చనీయాంశమవుతోంది. ఈ క్రమంలోనే తాను మరోసారి మండలి ఛైర్మన్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేరని కవిత ఆ మధ్య చెప్పారు. అయితే కవిత రాజీనామా ఆమోదించాలని బీఆర్ఎస్ పార్టీ కోరకపోవడం కూడా ఇంట్రెస్టింగ్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయ్యాక ఆమె మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌ను టార్గెట్ చేస్తున్నా..కవిత రాజీనామాను ఆమోదించాలని బీఆర్ఎస్..మండలి ఛైర్మన్‌ను కోరకపోవడం కూడా చర్చకు దారితీస్తోంది. ఎమ్మెల్సీ పదవికి రిజైన్ చేసిన కవిత జాగృతి ఆధ్వర్యంలో జనం బాట పేరుతో యాత్ర చేస్తున్నారు. నిజామాబాద్ నుంచే కవిత యాత్ర మొదలు పెట్టారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ పదవికి కవిత చేసిన రాజీనామాను ఎందుకు ఆమోదించట్లేదని ప్రశ్నించారు అరవింద్. రేవంత్ రెడ్డికి, కవితకు మధ్య ములాఖత్ ఏంటి.? ఆమె రాజీనామాను ఎందుకు ఆమోదించడం లేదు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అంతేకాదు కవిత రిసిగ్నేషన్‌ను ఆమోదించాలని కోరుతూ మండలి ఛైర్మన్‌కు లేఖ రాస్తామంటున్నారు. కవితతో రేవంత్‌రెడ్డే కొత్త పార్టీ పెట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. మామూలుగా అయితే అధికార పక్షం రాజీనామాను ఆమోదించాలి. బీఆర్ఎస్ ఆ రాజీనామా ఆమోదం కోసం పట్టుబట్టాలి. ఈ రెండూ జరగట్లేదు. కానీ బీజేపీ మాత్రం కవిత రాజీనామా ఆమోదం కోసం తాము లేఖ రాస్తామని చె ప్పుండటం హాట్ టాపిక్‌గా మారింది. బీజేపీ మండలికి లేఖ రాస్తుందా.? బీజేపీ లేఖ తర్వాతైనా కవిత రాజీనామాకు ఆమోదం లభిస్తుందా అన్నది చూడాలి మరి.

## సీఎం రేవంత్ అహర్నిశలు కృషి...




చేవెళ్ల, అక్టోబర్ 29 : పేదల సంక్షేమం, అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని చేవెళ్ల శాసన సభ్యులు కాల యాదయ్య వెల్లడించారు. బుధవారం చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో 70 మంది లబ్ధిదారులకు 74 లక్షల 8వెల 54 రూపాయల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్లిష్టంగా ఉన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను నిరంతర ప్రక్రియగా కొనసాగించడం జరుగుతున్నదన్నారు. ఇందిరమ్మ ఇల్లు, గృహాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ తదితర పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు పలికి గెలిపించాలని ఆయన కోరారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి మరింత బలం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎ. మధుసూదన్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, తహశీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్. బల్వంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మాలతి కృష్ణారెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, సర్పంచులు మధుసూదన్ గుప్తా, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, పాండు, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఎన్నికల్లో బిగ్ ట్విస్ట్.. దూసుకొస్తున్న సైలెంట్ వేవ్..

పాట్నా:ఇప్పుడు దేశం చూపంతా బీహార్ వైపే ఉన్నాయి. ఇక్కడ మరోసారి ఎన్డీయే కూటమి విజయం సాధించబోతోందా? లేక ఆర్జేడీ నేతృత్వంలోని మహాకూటమి జెండా ఎగరవేయబోతోందా?నితీష్ ఊహించని ట్విస్ట్ ఏమైనా ఇస్తాడా? ఆ ప్రభావం కేంద్రంలోని మోదీ సర్కార్ పై ఎలా ఉండబోతోంది? ఇలాంటి ప్రశ్నలకు మరో 17 రోజుల్లో సమాధానం రానుంది. అయితే.. ఈ సారి ఎవరూ ఊహించని రిజల్ట్స్ వస్తాయని.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు రీవర్స్ అవుతాయని విశ్లేషకుల లెక్కలు చెబుతున్నాయి. నవంబర్ 14న వెలువడనున్న ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఎన్నికలంటే పెద్ద ఎత్తున హడావుడి, పెద్ద ర్యాలీలు, బహిరంగ ప్రకటనలు, రాజకీయ నాయకుల స్పీచులు, హామీలతో హోరెత్తుతాయి. అయితే అందుకు విరుద్ధంగా ఇప్పుడు బీహార్ ఎన్నికలు కనిపిస్తున్నాయి. పెద్దగా హడావుడి కనిపించడం లేదు. ర్యాలీలు, మీటింగ్ ల వద్ద కూడా జనాలు కూడా రావడం లేదు. ఈ నిశబ్ద విప్లవం ఫలితాల సరళిని పూర్తిగా మార్చివేయవచ్చునని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మహిళా ఓటర్ల నుంచి వచ్చిన సైలెంట్ వేవ్ నితీష్ ను మరో సారి గద్దెనెక్కించింది. ఇదే తరహాలోనే ఈసారి కూడా వారు ఓటు ఎవరికి వేయబోతున్నారనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. నిరుద్యోగం, వలసలు వంటి అంశాలపై అసంతృప్తి ఉన్న యువత కూడా తమ ఓటును ఎవరికి వేయబోతున్నారో బహిరంగంగా ప్రకటించడం లేదు. మార్పును కోరుకునే ఈ యువత ఓటు నిశ్శబ్దంగా ఒకవైపు మొగ్గు చూపితే, ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉండవచ్చు.

**నితీష్ కుమార్ బోలేడు హామీలు**

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చాలానే హామీలు ఇచ్చారు. 2030 నాటికి యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామని,



మహిళలకు నెలకు రూ. 30వేలు ఇస్తామని ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. అటు ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ ఏకంగా అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోపు ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడానికి చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు, పోస్ట్-గ్రాడ్యుయేట్లకు నెలకు రూ. 2,500 నుంచి - రూ. 3,000 చొప్పున స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. దీనికి తోడు పార్టీ మారిన ఎమ్మెల్యేలు, టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్యేల ప్రభావం ఫలితాలపై ఏ మేరకు ఉంటుందో చూడాలి. 2020 ఎన్నికల్లో కూడా ఫలితాలు అంచనాలకు భిన్నంగా వచ్చాయి. ఈసారి కూడా ఇదే పునరావృతమైతే, నవంబర్ 14న తీవ్ర ఉత్కంఠ నెలకొంటుంది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో (నవంబర్ 6. నవంబర్ 11 తేదీల్లో) పోలింగ్ జరగనుంది. నవంబర్ 14వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. సాధారణంగా దేశంలో ఎన్నికల వచ్చినప్పుడు జాతీయ స్టాక్ మార్కెట్ లో హెచ్చుతగ్గులు ఉంటాయి. బీహార్ లో ఎలాంటి ఫలితాలు వచ్చిన అందుకు అందుకు పెట్టుబడిదారులు సిద్ధంగా ఉండాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

## తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసరాల పంపిణీ

అమరావతి,అక్టోబర్29: తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరకులు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్లు, అధికారులు, మంత్రులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. తుపాను నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, మంత్రులకు సూచనలు చేశారు. సమర్థంగా వ్యవహరించి నష్ట నివారణ చర్యలు చేపట్టాం. సీఎం నుంచి సచివాలయం సిబ్బంది వరకు అందరం టీమ్‌గా పనిచేశాం. కష్టకాలంలో బాధితుల కోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు. మరో రెండు రోజులు ఇలానే పనిచేస్తే.. మరింత ఊరట ఇవ్వగలం. మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలన్నారు. ప్రభుత్వం ఏం చేసిందో చెబుతూ సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలి. వివిధ విభాగాల్లో నష్టం అంచనా వేసి కేంద్రానికి నివేదిక అందించాలి. తుపానును నివారించలేం.. ముందు జాగ్రత్తలతో చాలా వరకు నష్టాన్ని నివారించగలిగాం. కలెక్టర్లు, అధికారులు రియల్ టైమ్ సమాచారం తెప్పించుకున్నారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా, విద్యుత్ తీగలు తెగిపడినా యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మున్సిపాలిటీల్లో డ్రెయిన్ల శుభ్రం వల్ల ముంపుబారిన పడకుండా చేశాం. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు 10 వేల మందిని




అందుబాటులో ఉంచాం. ఇవాళ మధ్యాహ్నానికి సాధారణ స్థితి ఏర్పడుతుంది. తుపాను కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై ప్రజలకు భరోసా పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఇకపోతే మొంథా తుఫాన్ కారణంగా ఇళ్లు విడిచి పునరావాస కేంద్రాలకు చేరిన కుటుంబాలకు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## సంపాదకీయం

గురువారం 30-10-2025

# ఏఐ భారత్‌కు కొత్త ఆలంబన

కృత్రిమ మేధ(ఏఐ) విప్లవంతో అంతర్జాతీయ డిజిటల్ మౌలిక వసతుల రూపురేఖలు మారిపోతున్నాయి. 2025లో 23,600 కోట్ల డాలర్లుగా ఉన్న ప్రపంచ ఏఐ మార్కెట్ పరిమాణం 2030కల్లా 93వేల కోట్ల డాలర్లకు పెరగనుంది. ఫలితంగా ఏఐ ఆధారిత డేటా కేంద్రాలకు గిరాకీ ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో రానున్న గూగుల్ డేటా కేంద్రం ప్రాజెక్టు భారత ఏఐ చరిత్రనే తిరగరాసే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక డేటా కేంద్రాలు ఉత్తర అమెరికాలో ఉండగా, తదుపరి స్థానాన్ని ఆసియా-పసిఫిక్ దేశాలు ఆక్రమిస్తున్నాయి. ఈ రెండు ప్రాంతాల మధ్య కీలక స్థానంలో ఇండియా ఉంది. భారత్‌లో 2019లో 540 మెగావాట్లుగా ఉన్న డేటా కేంద్రాల సామర్థ్యం 2023 నాటికి 1000 మెగావాట్లకు చేరింది. ఈ విషయంలో 2030 వరకు ఏటా 28శాతం చక్రీయ వృద్ధిరేటు (సీఏజీఆర్) నమోదు కానుంది. డిజిటలీకరణ ఊపందుకోవడం, కృత్రిమ మేధ వినియోగం పెరగడం, 5జీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఎడ్జ్ కంప్యూటింగ్‌లు విస్తరించడంతో ఈ రంగంలో వృద్ధి వేగవంతమవుతోంది. 2027కల్లా భారత్‌లోని డేటా కేంద్రాల్లోకి 10వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు ప్రవహించనున్నాయి. అయితే, నేడు భారత్‌లోని డేటా కేంద్రాల్లో 94శాతం వరకూ ముంబయి, చెన్నై, దిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, పుణె, కోల్‌కతాల్లోనే కేంద్రీకృతమయ్యాయి. వీటిని వికేంద్రీకరించడం చాలా అవసరం. విశాఖపట్నంలో 1500 కోట్ల డాలర్లతో ఏఐ హబ్, డేటా కేంద్రాలను నెలకొల్పుతామని గూగుల్ సంస్థ ప్రకటించడం విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. భారత్‌లో గూగుల్ నెలకొల్పుతున్న తొలి ఏఐ హబ్ ఇదే. ఇండియాలో గూగుల్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి కూడా ఇదే.

మహానగరాలకు ప్రత్యామ్నాయంగా...

ఇంతవరకు భారతదేశ సముద్ర తీరంలోని ముంబయి, చెన్నైలలోనే డిజిటల్ హబ్‌లు ఏర్పడుతుండగా తాజాగా ఆంధ్రప్రదేశ్ తీరంలోని విశాఖపట్నం సరికొత్త హబ్‌కు నెలవు కానుంది. మహానగరాలకు ప్రత్యామ్నాయంగా రెండో అంచె నగరాలూ డిజిటల్ కేంద్రాలుగా ఆవిర్భవించగలవని చాటుతోంది. విశాఖలో గూగుల్ నెలకొల్పే 1 గిగావాట్ డేటా కేంద్రం హైపర్ స్కేల్ కంప్యూటింగ్, హరిత ఇంధన వినియోగం, సముద్రగర్భ కేబుళ్లు, ఫైబర్ అనుసంధానతకు నెలవవుతుంది. దీర్ఘకాలంలో భారతదేశంలో కృత్రిమ మేధా వ్యవస్థ విస్తరణకు కీలక సాధనం కానుంది. భారత సముద్ర తీరంలోని మరిన్ని నగరాలు, పట్టణాల్లో ఏఐ డేటా కేంద్రాల స్థాపనకు విశాఖ నాంది పలుకుతుంది. ఇక్కడ ఏర్పడనున్న డేటా కేంద్రంలో గూగుల్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. గూగుల్ సంస్థ ప్రధాన పెట్టుబడిదారు, ఏఐ మౌలిక వసతుల నిర్మాత. ఈ సంస్థ విశాఖ డేటాహబ్‌ను తన అంతర్జాతీయ కంప్యూటింగ్ కేంద్రంగా, భారతీయ సంస్థలకు క్లౌడ్ సేవలు అందించే వసతిగా తీర్చిదిద్దుతుంది. సముద్ర గర్భం నుంచి వచ్చే కేబుళ్లకు విశాఖలో ల్యాండింగ్ స్టేషన్‌నూ, నగరాల లోపల, నగరాల మధ్య ఫైబర్ నెట్‌వర్క్‌ను ఎయిర్‌టెల్ నిర్మిస్తుంది. గూగుల్ డేటా సెంటర్ కోసం స్థల సేకరణ, హరిత, సంప్రదాయ ఇంధన సరఫరా, డేటా కేంద్ర నిర్మాణ పనులను అదానీ గ్రూపు చేపడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే గూగుల్ సంస్థ విశాఖపట్నంలో ఏఐ హబ్, డేటా కేంద్రం, కంప్యూటింగ్ వ్యవస్థ నిర్మాణాలకు నిధులు, సాంకేతికతలను సమకూరుస్తుంది. నిర్మాణ పనులను అదానీ సంస్థ చూసుకుంటుంది. హరిత ఇంధన సరఫరా, ప్రధాన క్యాంపస్ భవనాల నిర్మాణం, విద్యుత్ సరఫరా లైన్ల ఏర్పాటును చేపడుతుంది. సముద్ర గర్భ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్, హైకెపాసిటీ ఫైబర్ నిర్మాణం, జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్కులతో అనుసంధానం ఎయిర్‌టెల్ బాధ్యత. గూగుల్ డేటా కేంద్రానికి భూమి కేటాయిం పు, సత్వర అనుమతులు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, విధానపరమైన మద్దతును కల్పించే బాధ్యతను ఏపీ ప్రభుత్వం స్వీకరించింది. జాతీయ డేటా, టెక్ హబ్‌గా నిలవాలన్న ఏపీ దీక్షకు ఈ ప్రాజెక్టు ఒక తార్కాణం. సొంతంగా డిజిటల్ మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవడం ఇండియా ఆశయం. అలాగే పునరుత్పాదక ఇంధన వనరులతో హరిత విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ అనుసంధానత, ఏఐ, కంప్యూటింగ్ సర్వీసులను స్వయంగా సమకూర్చుకోవడమ నే భారతదేశ లక్ష్యాలు సైతం గూగుల్ డేటా సెంటర్, ఏఐ హబ్‌లలో ప్రతిఫలిస్తున్నాయి.

బహుముఖ ప్రభావం

డేటా సెంటర్ నిర్మాణం, నిర్వహణలలో ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. స్థిరాస్తి రంగం, రవాణా, బట్వాడా, హొటల్, ఇతర సర్వీసులలో పరోక్ష ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. శీతలీకరణ, విద్యుత్ సరఫరా, ఫైబర్, సెక్యూరిటీ పరంగా స్థానికులకు కాంట్రాక్టులు లభిస్తాయి. మౌలిక వసతుల అభివృద్ధితో స్థానిక ప్రజలకు, సంస్థలకు సౌర, పవన విద్యుత్తు అందివస్తుంది. ఇంధన నిల్వకు అధునాతన వసతులు సమకూరతాయి. హై స్పీడ్ ఫైబర్ అనుసంధానత స్థానిక ఆస్పత్రులకు, విద్యాసంస్థలకు, వ్యాపారాలకు, ప్రజాసేవలకూ ఉపయోగపడుతుంది. రహదారులు, రవాణా సౌకర్యాలు విస్తరిస్తాయి. విశాఖపట్నం సముద్ర గర్భ కేబుల్ ల్యాండింగ్ కేంద్రం కావడంతో సింగపూర్, దుబాయ్, మార్సెయిల్ మాదిరిగా డిజిటల్ నగరంగా రూపాంతరం చెందుతుంది. ఇతర బడా టెక్ కంపెనీలూ విశాఖకు బారులు తీరవచ్చు. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ సాంకేతికంగా అగ్రగాముల సరసన చేరుతుంది. విశాఖ చుట్టూ డిజిటల్ టౌన్‌షిప్‌లు ఏర్పడతాయి. అనుబంధ టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలు నెలకొంటాయి. విదేశాల నుంచి, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి టెక్ నిపుణులు తిరిగొచ్చే అవకాశాలు పెరుగుతాయి. విద్యవైద్య రంగాలు, గృహవసతి విస్తరిస్తాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో గూగుల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపడితే, ఏపీలో ఏఐలో నిష్ణాతులు తయారుకావచ్చు. విశాఖలో గూగుల్ ప్రయోగం సఫలమైతే భారతదేశపు తదుపరి డిజిటల్ మౌలిక వసతుల విస్తరణకు మేలైన నమూనాగా నిలుస్తుంది.

# ఎల్ఐసి ఉనికికే ప్రమాదం !

న్యూఢిల్లీ,అదానీతో మోడీ బంధం ఎంతో బలమైనది. అది ఫెవికాల్ లాంటిది. దానిని విడదీయడం అంత సులువు కాదు. గత పదేళ్లుగా ఇది రుజువైన విషయం. అదానీ కంపెనీపై వరుసగా విమర్శలు వస్తున్నా..ఏనాడూ చర్యలు తీసుకోలేదు. సరికదా ఖండించడానికి కూడా ప్రధాని మోడీ పెదవి విప్పలేదు. అదానీ వ్యవహారంపై గతంలో పార్లమెంట్ స్తంభించింది. అదానీ గ్రూపు ఆర్థిక అవతవకలు, అమెరికా సంస్థ ఆరోపణలు అలా ఉండగానే తాజాగా ఆ కంపెనీకి ఎల్ఐసి మొత్తాన్ని ధారపోసారు.గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిచింది. ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత జీవిత బీమా సంస్థ ఎల్ఐసిని అదానీ ప్రయోజ నాల కోసం కేంద్ర ప్రభుత్వం బలి పెట్టడంపై వస్తున్న విమర్శలను సైతం పట్టించుకోవడం లేదు. అంటే ప్రధాని మోడీ తన ప్రధాని పదవిని అడ్డం పెట్టి అదానీకి అండగా నిలబడ్డారని వేరుగా చెప్పనక్కరలేదు. కోట్లాదిమంది పాలసీదారుల, ఉద్యోగుల, అధికారుల ప్రయోజనాలను అదానీ వ్యాపార కాంక్షకు సమిధలు చేయడం అమానుషం. నిజానికి గతంలోనే ఎల్ఐసిని ప్రైవేటీకరించాలని చూశారు. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సైతం ప్రైవేటీకరణకు రంగం సిద్దం చేశారు. కానీ బిజెపికి పూర్తి మెజార్టీ రాకపోవడం, ఏపిలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో ఆగిపోయింది. ఎల్ఐసిని ప్రైవేటీకరిస్తే ఆదానికి అప్పగించేవారేమో అన్న అనుమానాలు ఇప్పుడు కలుగుతున్నాయి. దేశీయంగా ఉన్న కంపెనీలను ఇలా తన తాబేదార్లకు కట్టబెట్టే కుట్ర లోపాయకారిగా జరుగుతున్నదని ప్రజలు గుర్తించాలి. ఎల్ఐసి మొత్తాలను ఆదానికి అప్పుగా బదిలీ చేయడంపై దేశంలో అప్పుడే నిరసనలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలుగు రాష్ట్రాల్లో లెఫ్ట్ నేతలు కూనంనేని సాంబశివరావు, బివి రాఘవులు వంటివారు, మరికొందరు నిరసనల గళం విప్పారు. బీహార్ ఎన్నికల సందడిలో ఇదంతా గుట్టు చప్పుడు కాకుండా సాగిపోతోంది. సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొత్తాన్ని అదానీ గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్లించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగిందన్నది చెప్పకనే చెప్పవచ్చు. అమెరికా నుండి వెలువడే 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఈ కథనం తొలుత రావడం గమనార్హం. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానీకి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు అంటే 33 వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగానే అదానీ పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల దాదాపు రూ.5,000 కోట్లు బాండ్లను ఎల్ఐసి కొనుగోలు చేసింది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా కోర్టుల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించిందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంటర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొందంటే పథకం ఎంత పకడ్బందీగా రూపొందించారో తేటతెల్లమవుతుంది. ఆదానీ పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నత స్థాయిలో ఎల్ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైందని అర్థం అవుతోంది. మే 30వ తేదీన అదానీ పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్ఐసి కొనేసింది. అదానీ గ్రూపు షేర్లు, బాండ్లు కొనడానికి విదేశీ విత్త సంస్థలేవీ సిద్ధం కాని నేపథ్యంలో భారత ప్రభుత్వరంగ బీమా సంస్థచేత కొనిపించి, అదానీ గ్రూపునకు విశ్వసనీయత కల్పించాలన్నదే ఆ పథకంలో భాగంగా అర్థం చేసుకోవచ్చు. ఆ పాచిక పారింది కనుకనే అంతకు ముందు వెనక్కి తగ్గిన అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ జూన్‌లో 750 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.6,650 కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఆదానీ ఆర్థిక అక్రమాలు, అవినీతిపై 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసింది. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని ఎల్ఐసి పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని, వాటిపై తమదే తుది నిర్ణయమని బుకాయించింది. అందువల్ల ఎల్ఐసిలో ఏం జరుగుతుందో దేశ ప్రజలకు తెలపడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించడం అవసరమన్న డిమాండ్‌ను కూడా ఆమోదిం చాలి. ఇంతపెద్ద మొత్తంలో వ్యవహారం గుంభనంగా సాగడాన్ని అడ్డుకోవాలి. ఎల్ఐసిని మరోమారు ప్రైవేట్ రంగానికి అప్పగించే కుట్రలో కూడా ఇదో భగంగా చూడాలి. అందుకోసం ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరచాలి. పాలకుల కార్పొరేట్ అనుకూల నిర్ణయాలపై నిలదీయాలి. లేకుంటే ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ కావడం ఖాయం. దీనిపై విపక్ష కాంగ్రెస్ గట్టిగా నిలబడాలి. నిజానిజాలను వెల్లడించేందుకు పోరాటం చేయాలి. ఓట్ చోరీ పక్కన పెట్టి ఎల్ఐసిని రక్షించే పోరాటానికి దిగాలి. అందుకు దేశంలోని ప్రజలు కూడా అడుగులు వేయాలి.

# అమెరికా ఆంక్షలకు పుతిన్ దిగివచ్చేనా?



శత్రువును జయించాలంటే కేవలం భుజబలం మాత్రమే ఉంటే చాలదు. పరిస్థితులను బట్టి సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తేనే ఫలితం సానుకూలమవుతుంది. ఆవేశమే తప్ప ఆలోచన అంతగా లేని అగ్ర రాజ్యాధినేత ట్రంప్ మహాశయుడికి ఈ విషయం గ్రహించడానికి పది నెలల సమయం పట్టిందంటే ఆశ్చర్యం ఏముంది? రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించడం తనకు చిటికెలో పని అంటూ ఆయన ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తాను అధికారంలోకి వస్తే ఇరవై నాలుగు గంటల్లో యుద్ధాన్ని ఆపేస్తానంటూ ప్రతినలు పలికారు. కానీ, రాజకీయాల్లో రష్యా అధినేత పుతిన్ తనకంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివారన్న వాస్తవం గ్రహించడానికి ఆయనకు ఇంతకాలం పట్టింది. ఉక్రెయిన్ యుద్ధ విరమణ దిశగా ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు పుతిన్ పురిట్లోనే సంధి కొడుతున్నారు. అలస్కాలో గత ఆగస్టు నెలలో పుతిన్ తో జరిగిన ముఖాముఖీ భేటీలో ఫలితమేమీ తేలకపోవడంతో ట్రంప్ అహం దెబ్బతింది. యుద్ధాన్ని ఆపాలంటే ఉక్రెయిన్ లో కొన్ని భూభాగాలను తమకు దఖలు పరచాల్సిందేనంటూ మొండికేస్తున్న పుతిన్ ను దారికి తెచ్చేందుకు తాజాగా ఆయన రష్యా చమురు కంపెనీలపై ఆంక్షల కొరడా ఝుళిపించారు. ఈ పరిణామం పుతిన్ ను ఒక కుదుపు కుదిపిందనే చెప్పాలి. రష్యాలోని అతి పెద్ద చమురు కంపెనీలు రాస్ నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా, ఐరోపా కూటమి విధించిన ఆంక్షల ప్రభావం రష్యా తోపాటు భారత్, చైనాలపై ఎక్కువగా పడింది. ఆ రెండు కంపెనీలకూ అనుబంధంగా పనిచేస్తున్న పలు సంస్థలకూ ఆంక్షలు వర్తింపజేయడంతో రష్యా నుంచి చమురు ఎగుమతులు స్తంభించిపోయే పరిస్థితి నెలకొంది. తాజా ఆంక్షలతో 557 చమురు షాడో కంపెనీలపై నిషేధం పడినట్లయింది. అమెరికా, ఐరోపా దేశాలు తీసుకున్న నిర్ణయం కారణంగా ముడి చమురు ధరలకు రెక్కలు వచ్చాయి. చమురును రవాణాచేసే సూపర్ ట్యాంకర్ల చార్జీలు ఒక్క రోజే 16 శాతం పెరగడం ఇందుకు ఒక ఉదాహరణ. గత రెండేళ్లలో ఇలా చార్జీలు పెరగడం ఇదే మొదటిసారి. అమెరికా ఆంక్షలకు తలొగ్గేది లేదంటూ పుతిన్ బీరాలు పలుకుతున్నా చమురు కొనుగోళ్లు నిలిచిపోతే, ఇప్పటికే యుద్ధం కారణంగా అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం అసాధ్యమన్న సంగతి ఆయనకు తెలియనిదేమీ కాదు. తాజా ఆంక్షల వల్ల రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతోపాటు దాని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుందనేది నిర్వివాదాంశం. అయితే ఆంక్షలు ఎంతమేరకు కట్టుదిట్టంగా అమలవుతాయో వేచి చూద్దామనే ధోరణిలో ఆయన ఉన్నట్లు కనబడుతోంది. ఒకప్పుడు పుతిన్ ను టఫ్ గై, స్మార్ట్ గై అంటూ ఆకాశానికి ఎత్తేసిన ట్రంప్ కు పుతిన్ అసలు రూపం ఇప్పుడు బోధపడినట్లుంది. తాజాగా బుడాపెస్ట్ లో ఇరువురు అధినేతల మధ్య జరగవలసిన భేటీని పుతిన్ రద్దు చేసుకోగా, ఫలితం తేలని చర్చల వల్ల ప్రయోజనమేమిటంటూ ట్రంప్ పెదవి విరచడానికి కారణం అదే. భారత్ విషయానికొస్తే, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ రష్యా చమురును చౌకగా కొనుగోలు చేస్తోంది. భారత ముడిచమురు అవసరాల్లో మూడో వంతు భాగం రష్యానుంచే దిగుమతి అవుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ సగటున రోజుకు 1.7 మిలియన్ బారెళ్ల చమురును భారత్ దిగుమతి చేసుకుంటే, ఇందులో 1.2 మిలియన్ బారెళ్ల చమురు తాజాగా నిషేధం వేటు పడిన రెండు సంస్థలనుంచే రావడం గమనార్హం. ఈ దిగుమతుల్లో అధిక వాటాను రిలయన్స్, నయారా ఎనర్జీ సంస్థలే కొనుగోలు చేస్తుండగా, స్వల్ప పరిమితిలో భారత ప్రభుత్వ రంగ సంస్థలు దిగుమతి చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ లెక్కల ప్రకారం రష్యానుంచి భారత్ కు ప్రతి నెలా సుమారు ఏడు మిలియన్ బారెళ్ల చమురు దిగుమతి అవుతోంది. ప్రపంచ ముడి చమురు, రిఫైన్డ్ వినియోగంలో ఇది ఏడు శాతానికి సమానం. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోక తప్పని పరిస్థితుల్లో భారత్ కు మళ్లీ పశ్చిమాసియాయే దిక్కయ్యేటట్లు కనిపిస్తోంది. అదే జరిగితే, ప్రస్తుతం భారత్ పై 50 శాతానికి పెంచిన సుంకాలను అమెరికా 15 శాతానికి తగ్గించే అవకాశం లేకపోలేదు.

# తుపాను వల్ల ప్రాణ,ఆస్తి నష్టాలు జరగకుండా చర్యలు

విజయవాడ,సాంకేతిక పరిజ్ఞానంతో తుపానును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని ఎన్టీఆర్ జిల్లా తుపాను ప్రత్యేక అధికారి, శశిభూషణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తో కలసి కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఆయన పరిశీలించి, జిల్లావ్యాప్తంగా చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. విపత్తు ఎదుర్కోవడానికి అవసరమైన జెసిబి, ట్రాక్టర్లు, యంత్రాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, కీలక శాఖల సిబ్బంది తుపాను ప్రతిస్పందన చర్యలలో నిమగ్నమై ఉన్నారని చెప్పారు. అన్ని వసతులతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారని, క్షేత్రస్థాయి యంత్రాంగమంతా సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు. అవసరమైన యంత్రాలు, సామాగ్రి అందుబాటులో ఉన్నాయని, ఆస్తి ప్రాణ నష్టాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. ఇది తీవ్ర తుపాను అని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఏర్పాట్లు, చర్యలపై తమ ఫీడ్ బ్యాక్ ఇవ్వొచ్చని చెప్పారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ... అవేర్ వెబ్సైట్ ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తుపాను ముప్పు పొంచి ఉన్న గ్రామాల, ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా కాలువల్లోని నీటిని నియంత్రిస్తున్నామని, బుడమేరుపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. మంగళవారం నగరంలో భారీ వర్షం కురుస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో నగరవాసులు బయట తిరగవద్దని, దుకాణాలు మూసి ఉంచాలని సూచించారు. రైతులు పంట కోతలు కోయరాదని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్ళవద్దని సూచించారు.

# లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత బండి ప్రకాశ్

హైదరాబాద్: ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీలో సరెండర్ల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే పార్టీ అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, తక్కళ్లపల్లి వాసుదేవరావు ఆయుధాలతో సహా లొంగిపోయిన విషయం తెలిసిందే. మరో కీలక నేత ఆశన్న తన దళ సభ్యులతో కలిసి సరెండర్ అయ్యారు. తాజాగా మావోయిస్టు రాష్ట్ర మాజీ కమిటీ సభ్యుడు, సింగరేణి కార్మిక సమాఖ్య బాధ్యుడు బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ అలియాస్ అశోక్ అలియాస్ క్రాంతి కూడా లొంగిపోయారు. మంగళవారం ఉదయం డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ప్రకాశ్ గత 45 ఏండ్లుగా మావోయిస్టు పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ పార్క్ ఏరియా అత్యంత కీలక ఆర్గనైజర్‌గా పనిచేస్తున్నారు. ప్రభాత్ అనే పేరుతో ప్రెస్ టీమ్ ఇన్‌చార్జిగా పనిచేశారు. మందమర్రిలోని పోచమ్మ ఆలయం ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడు బండి రామారావు, అమృతమ్మ దంపతుల రెండో కుమారుడైన ప్రకాశ్.. 1982-84 మధ్య అప్పటి పీపుల్స్ వార్ అనుబంధ విద్యార్థి విభాగమైన రాడికల్ స్టూడెంట్ యూనియన్? 'గ్రామాలకు తరలండి' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) ఆవిర్భావం తరువాత అందులో మిలిటెంటుగా పనిచేశారు. 1984 నవంబర్?లో మందమర్రికి చెందిన ఏఐటీయూసీ లీడర్ వీటీ అబ్రహం హత్య కేసులో అరెస్టై జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత వరంగల్? జైలు నుంచి ఆదిలాబాద్ సబ్ జైలుకు తరలించగా పీపుల్స్?వార్ నేతలు నల్లా అదిరెడ్డి, హుస్సేన్, ముంజం రత్నయ్యతో కలిసి జైలు నుంచి తప్పించుకున్నారు. కొంతకాలానికి బయటకు వచ్చి హేమను పెండ్లి చేసుకొని సాధారణ జీవితం గడిపారు. తిరిగి హైదరాబాద్?లో అరెస్టు అయిన ఆయనకు చర్లపల్లి జైలులో పీపుల్స్ వార్ అగ్రనేత శాకమూరి అప్పారావు తదితరులతో ఏర్పడిన పరిచయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) పునరుద్ధరణ బాధ్యతను మావోయిస్టు పార్టీ ఆయనకు అప్పగించింది. ఇందులో భాగంగా రిక్రూట్‌మెంట్ కూడా నిర్వహించారు. అనేక కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మావోయిస్టులతో శాంతిచర్చల నేపథ్యంలో ఆసిఫాబాద్ సమీపంలోని మోవాడ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ప్రకాశ్ అధ్యక్షత వహించారు. అయితే శాంతి చర్చలు విఫలమవడంతో మళ్లీ అజ్ఞాతంలో వెళ్లారు. కాగా, వయస్సు మీదపడటంతో పాటు షుగర్ వ్యాధితో బాధ పడుతున్న ఆయన అనారోగ్య సమస్యలతో లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది. ఆయనపై తెలంగాణ ప్రభుత్వం రూ.25లక్షల రివార్డు ప్రకటించింది.

# అవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు హెచ్చరిక

కాకినాడ,మొంథా తుపాను ప్రభావంతో ఏపీవ్యాప్తంగా తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో కెరటాల ఉధృతి మరింత పెరిగింది. ఈ ప్రభావంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్ రోడ్డు ధ్వంసమైంది. తుపాను ప్రభావంతో విశాఖ జిల్లాలో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. పలు చోట్ల చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహిస్తోంది. ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై నీటమునిగిన సర్వీసు రోడ్డు బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వేపై నుంచి పారుతున్న నీరు విశాఖపట్నంలోని 13వ వార్డులో చెట్టు కూలింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, కాకుమాను, ప్రత్తిపాడు, పెదనందిపాడు, తాడికొండ, తుళ్లూరు, మేడికొండూరు మండలాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 72 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జీఎంసీ పరిధిలోని మూడు నియోజకవర్గాలను ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అధికార, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నిజాంపట్నం హార్బర్‌లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లద్దని అధికారులు హెచ్చరించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తు న్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, గురజాల సహా పలు చోట్ల వానలు పడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. తీరప్రాంత గ్రామాలు, పర్యాటక ప్రాంతాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. నెల్లూరు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల భారీ, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు పడుతున్నాయి. కృష్ణపట్నం పోర్టులో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. నెల్లూరు తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. తుపాను కారణంగా విశాఖకు వచ్చే 16 రైళ్లు రద్దయ్యాయి. ఇండిగో, ఎయిరిండియా విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. తుపాను సహాయక చర్యల కోసం తూర్పు నౌకాదళం సన్నద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుపాను ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటికే కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లోనూ పలుచోట్ల చిరుజల్లులు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 233 మండలాలు, 1,419 గ్రామాలు, 44 మున్సిపాలిటీలపై తుపాను ప్రభావం ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే 2,194 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. 3,465 మంది గర్భిణీలు, బాలింతల సంరక్షణకు అధికారులు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపింది. 19 జిల్లాల పరిధిలోని 54 రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. జిల్లాల్లో కమ్యూనికేషన్ కోసం 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు ఏర్పాటు చేశామని తెలిపింది. 11 ఎన్డీఆర్ఎఫ్ 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు పేర్కొంది.

## వర్షపునీటిలో మునిగిన గిరిజన కాలనీ

నెల్లూరు,కోవూరు మండల పరిధిలోని పోతిరెడ్డి పాలెం చంద్రశేఖరపురం గిరిజన కాలనీ వర్షపు నీటితో మునిగి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీ మొత్తం మడుగులా మారిపోయింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు లబోదిబో మంటున్నారు. చిన్నారులు, వృద్ధులు నీటిలో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడుతున్నారు.

# తీరం దాటే సమయంలో భారీగా ఈదురుగాలులు

విశాఖపట్నం,బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుపానుగా బలపడింది. ఈ మేరకు విశాఖలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.గంటకు 15 కి.మీ వేగంతో ఉత్తర వాయవ్య దిశగా తుపాను కదిలిందని తెలిపింది. ప్రస్తుతం మచిలీపట్నానికి 190 కి.మీ, కాకినాడకు 270కి.మీ, విశాఖపట్నానికి 340 కి.మీ దూరంలో తుపాను కేంద్రీకృతమైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. క్రమంగా ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని తెలిపింది. మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీవ్ర తుపాను తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 110 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది. మొత్తంగా ఆంధ్రా వైపుకు ఎంతో వేగంగా దూసుకొస్తోంది. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90-110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతిభారీ వర్షాలు కురవనున్నాయని తెలిపారు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు.తీవ్ర తుఫానుగా రూపాంతరం చెందిన మొంథా మరికొన్ని గంటల్లో తీరం దాటనుంది. దీని ప్రభావంతో ఏపీ, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాను ప్రభావంతో ఒడిశా, ఏపీలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో బీచ్‌ల వద్ద అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. అలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో పర్యాటకులను సముద్రం వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మైకలలో అనౌన్స్ చేస్తున్నారు.

# 8 వేల ఫైళ్ళు...

హైదరాబాద్,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేషీలో సుమారు 8వేల ఫైళ్ళు మూలుగుతున్నాయనే చర్చ సచివాలంలో జోరుగా సాగుతున్నది. ఒక నెల రెండు నెలలు కాదు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నుంచి ఇదే తంతు అని అంటున్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని రిటైర్డు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు సచివాలయంలోని విక్రమార్క పేషీ చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ కోసం బలిదానం చేసిన శ్రీకాంతా చారి మాదిరి తాము కూడా ఆత్మహత్య చేసుకుంటామని కొందరు రిటైర్డు ఉద్యోగులు అల్టిమేటం కూడా ఇచ్చి వెళ్తున్నారు. గతంలో చిన్న కాంట్రాక్టర్లు తమ బకాయిలు చెల్లించడం లేదని ఛాంబర్ ముందే ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. కమీషన్లు ఇచ్చిన వారికే బకాయిలు ఇస్తారా, తమకు డబ్బులు ఇవ్వరా అంటూ పేషీ ఉద్యోగులను సైతం నిలదీస్తున్నట్లు సచివాలయంలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి బిల్లుల చెల్లింపులో పక్షపాతం ప్రదర్శిస్తున్నారు. కమీషన్లు ఇచ్చిన వారికే బిల్లులు మంజూరు చేస్తున్నారని, మిగతావారికి పక్కన పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అసెంబ్లీలో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ 15 శాతం కమీషన్ తీసుకుని బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్లు తీసుకుని బిల్లులు పాస్ చేయడం ఏంటని ఆయన నిలదీసిన విషయం విదితమే. ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు ఆర్థిక శాఖ ను సరిచేయలేదు. బకాయిలు చెల్లించాలని ఇప్పటికి రెండుసార్లు ఉద్యోగ సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి. ప్రతి నెలా కొంత మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు కావడం లేదని సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బడా కాంట్రాక్టర్లు, కమీషన్లు ఇచ్చేవారికే నిధులు మంజూరు చేస్తున్నారని, ఉద్యోగులను పట్టించుకోవడం లేదని అంటున్నారు.సంగారెడ్డి లోని తెలంగాణ గ్రౌండ్ వాటర్ డిపార్ట్ మెంట్ ఉద్యోగం చేసి, పదవీ విరమణ చేసిన పీ.సత్యనారాయణ కొన్ని నెలల నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. హైకోర్టు ఆదేశం ప్రకారం తనకు రావాల్సిన జీతం బకాయిలు, ఫించన్ ఖరారు చేయాలని ఆయన సచివాలయంలో ఆర్థిక శాఖ చుట్టూ తిరుగుతున్నారు. హైకోర్టు ఆదేశాలు ఉండడంతో పరిష్కరించే అధికారం డిప్యూటీ సీఎం కు ఉండడంతో సత్యనారాయణ ఫైలును ఆయన పేషీకి పంపించారు. ఎనిమిది నెలలు అవుతున్నా ఇంత వరకు పరిష్కారానికి నోచుకోలేదు. సత్యనారాయణ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో లేఖ రాశారు. ఉద్యోగ విరమణ చేశారని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాల్సిందిగా కోరారు. అయినా డిప్యూటీ సీఎం నుంచి ఎలాంటి స్పందన లేదు. గత నెల బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ప్రజా వాణిలో సత్యనారాయణ వినతి పత్రం అందచేశారు. తనను కొన్ని ప్రత్యేక కారణాలతో ఉద్యోగం నుంచి తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఫైలును తమ శాఖ సకాలంలో పరిష్కరించకపోవడంతో పదవీ విరమణ జరిగిందని, దీనిపై నిర్ణయం తీసుకోవాలంటూ ఆర్థిక శాఖకు ఫైలు పంపించారన్నారు. ఏడాది కాలం దాటినా ఫైలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫించన్ ఏ తేదీ నుంచి ఇవ్వాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరగా, ఆర్థిక శాఖ అధికారులు సదరు ఫైలును డిప్యూటీ సీఎం మల్లు భట్టి పేషీ కి పంపించారు. ఇక అక్కడి నుంచి ఆ ఫైలుకు కదలిక లేదని, మోక్షం లభించడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు సత్యనారాయణ వినతి పత్రంలో తెలిపారు.చిన్న కాంట్రాక్టర్ల గోస చెప్పనలవిగా ఉన్నది. గత ప్రభుత్వంలో పూర్తి చేసిన పనులకు ఇంకా డబ్బులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది నెలల క్రితం సచివాలయంలోని మల్లు భట్టి విక్కమార్క ఛాంబర్ ముందు ధర్నా కూడా చేశారు. వీళ్లకు చెల్లించే బకాయిలు రూ.1 వేయి కోట్ల లోపే ఉన్నాయని అప్పట్లో అంచనా వేశారు. వారికి కూడా ఇప్పటి వరకు బకాయిలు చెల్లించలేదు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు కూడా రెండు నెలలుగా ప్రభుత్వంపై ఫీజు బకాయిల కోసం ఒత్తిడి చేస్తున్నాయి. డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీ కూడా అమలు చేయడం లేదని, మీరే న్యాయం చేయాలంటూ యాజమాన్యాలు ప్రతిపక్ష నాయకుల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తమకు ఫీజు బకాయిలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇక రిటైర్డు ఉద్యోగుల బాధ వర్ణనాతీతంగా ఉంది. రిటైర్మెంట్ బెన్ఫిట్స్ రెండేళ్లు దాటినా ఇవ్వడం లేదని, ఎలా బతకాలని వారు ఆర్థిక శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రతి నెలా పొదుపు చేసిన డబ్బులు కూడా ఇవ్వకుండా సతాయిస్తున్నారని, ఇది న్యాయమేనా అని నిలదీస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే తగిన శాస్తి చేశారని కొందరు ఆడిపోస్తున్నారు. బకాయిల ఫైళ్ళు పైవారికి పంపడం వరకు తమ బాధ్యత అని, మంజూరు చేసే అధికారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి చేతుల్లో

# అమాత్యా...ఇది తగునా?




న్యూఢిల్లీ,ఇతర విషయాల మాటెలా ఉన్నా మహిళలకు సంబంధించి బాధ్యతాయుతంగా మాట్లాడటం, నాగరికంగా వ్యవహరించటం మన నేతలకు ఇప్పట్లో చేతకాదని మధ్యప్రదేశ్ మంత్రి కైలాశ్ విజయ్‌వర్గియా నిరూపించారు. ఆ రాష్ట్రంలోని ఇండోర్‌లో గురువారం ఆస్ట్రేలియా క్రీడాకారిణులిద్దరి పట్ల ఒక దుండగుడు అసభ్యంగా ప్రవర్తించిన ఉదంతంలో ఆయన స్పందన అందరికీ దిగ్భ్రాంతి కలిగించింది. అది అర్ధరాత్రో అపరాత్రో జరిగింది కాదు. పట్టపగలు 11 గంటలకు నడిరోడ్డుపై చోటుచేసుకుంది. తాము బస చేసిన హోటల్ నుంచి కేవలం కొన్ని మీటర్ల దూరంలోని కెఫేకు వెళ్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగుడు వారిపై ఈ అఘాయిత్యానికి పూనుకున్నాడు. సమీపంలోని వ్యక్తి ఆ వాహనం నంబర్ గుర్తుపెట్టుకుని పోలీసులకు చెప్పటంతో వెనువెంటనే దుండగుణ్ణి అరెస్టు చేశారు. అకిల్ ఖాన్ అనే ఆ యువకుడిపై పాత కేసులు కూడా ఉన్నాయని తేలింది. పోలీసులు తక్షణం స్పందించి చర్య తీసుకున్న తీరు ఉన్నంతలో ప్రశంసించదగ్గదే. కానీ దాన్నంతటినీ మంత్రి వ్యాఖ్యలు నీరుగార్చాయి. మన దేశంలో క్రికెటర్లపై చచ్చేంత మోజు ఉంటుందట. అందువల్ల వారు బయట తిరిగేటపుడు సెక్యూరిటీని తోడు తీసుకుని వెళ్లాలట. ఈ ఘటన ఆ క్రీడాకారిణులకు ఒక గుణపాఠమట. క్రికెటర్లంటే ఉన్న మోజు వల్లే ఈ ఉదంతం జరిగిందని ఆయన ఎలా అనగలిగారో అనూహ్యం. మన పర్యాటక రంగం గతంతో పోలిస్తే ఎంతో విస్తరించింది. మన సాంస్కృతిక వారసత్వ వైభవం, వైవిధ్యభరితమైన ప్రకృతి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఈ రంగం ద్వారా మన జీడీపీకి రూ. 20 లక్షల కోట్లు సమకూరుతున్నదనీ, ఏటా పర్యాటకం 25 శాతం చొప్పున వృద్ధి చెందుతున్నదనీ ఇటీవలే కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖవత్ ఆ రాష్ట్రంలో జరిగిన సదస్సులోనే ప్రకటించారు. పైగా ఈ రంగంలో 8.4 కోట్ల మందికి ఉపాధి లభిస్తోంది. నిజానికి పర్యాటకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోతున్నామని నిపుణులు ఏనాటి నుంచో చెబుతున్నారు. నిరుడు మన దేశాన్ని కోటిమంది విదేశీ పర్యాటకులు సందర్శించగా, థాయ్‌లాండ్‌కు మూడు న్నర కోట్లమంది వెళ్లారు. మన దేశాన్ని సందర్శించేవారికి అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా ప్రభుత్వాలు జాగ్రత్తల పేరిట ఇచ్చే సలహాలు చదివితే ఆగ్రహం కలిగిస్తాయి. మనల్ని చిన్నచూపు చూస్తున్నారన్న అభిప్రాయం ఏర్పడుతుంది. మహిళలకు భద్రత, రక్షణ ఉండేలా చర్యలు తీసుకోవటం ద్వారా అవి దురభిప్రాయాలేనని చూపవచ్చు. అది చేయకపోగా ఇష్టానుసారం మాట్లాడటం తగునా?ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నేతృత్వంలో శాంతిభద్రతల విభాగం ఉంటుంది. రాష్ట్ర హోంమంత్రి ఇండోర్‌కు ఇన్‌ఛార్జి. స్థానికంగా ఉన్న హోల్కర్ స్టేడియంలో జరిగే అయిదు మ్యాచ్‌ల కోసం వేర్వేరు దేశాల టీమ్‌లు ఆ హోటల్‌లో బస చేశాయి. ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో ప్రోటోకాల్స్ ఉంటాయి. వాటిపై అధికారుల స్థాయిలో చర్చించుకునే ఉంటారు. తీసుకున్న భద్రతా చర్యలేమిటో తెలి యదుగానీ ఈ సిగ్గుచేటైన ఘటన చోటుచేసుకుంది. ఇందుకు క్షమాపణ చెప్పి, ఇవి పునరావృతం కానీయబోమని మంత్రి చెప్పివుంటే హుందాగా ఉండేది. బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థినిపై దుండగుడు అసభ్యంగా ప్రవర్తించినప్పుడు ఆందోళన చేస్తున్నవారితో 'అసలు సాయంత్రం ఆరు తర్వాత ఆడపిల్లలు బయటికెందు కొస్తారు?' అంటూ అప్పటి వీసీ త్రిపాఠీ చిందులు తొక్కారు. ఇలాంటి అనాగరిక, అనా రోగ్య అభిప్రాయాలు అన్ని వ్యవస్థల్లోనూ పాతుకుపోవటం వల్లే మహిళల పట్ల సమాజంలో చిన్నచూపు కొనసాగుతోంది. లైంగిక నేరాల విషయంలో మన ప్రభుత్వాలు ఉండాల్సినంత కఠినంగా ఉంటున్నాయా? మహిళలపై జరిగే ఇతర నేరాల సంగతలా ఉంచి అత్యాచారాల విషయంలో పడే శిక్షలే మూడు శాతం కన్నా తక్కువున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఏళ్ల తరబడి సాగే విచారణలు మరింతమంది నేరగాళ్లు పుట్టుకురావటానికి దోహదపడుతున్నాయి. ఇది మన వ్యవస్థల ఉదాసీనతను తేటతెల్లం చేస్తోంది. కనీసం ఈ కేసులోనైనా సత్వర విచారణ జరిగి, శిక్ష పడేలా చేయగలిగితే విదేశీ పర్యాటకులకు భరోసా ఇచ్చినట్టవుతుంది.

# నితీశ్ కుమార్‌కు అగ్నిపరీక్ష



పాట్నా:బీహార్‌లో 2025 నవంబర్‌లో ఎన్నికలు జరుగుతున్న వేళ రాష్ట్రం ఇదే పాలన కొనసాగింపా? మార్పా? అనే చౌరస్తాలో ఉంది. బిజెపి ఆధ్వర్యంలోని ఎన్‌డిఎతో నితీశ్ కుమార్ తాజా రాజకీయ కలయిక తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు చారిత్రక ప్రాధాన్యం ఉంది. రెండు దశాబ్దాలకు పైగా బీహార్ రాజకీయాలకు నాయకత్వం వహిస్తున్న నితీశ్ కుమార్‌కు ఇది పాలనా సంస్కరణలు, సామాజిక ఇంజనీరింగ్, తరచు రాజకీయ పునర్నిర్మాణాల ద్వారా సాగిన ఒక యుగానికి చివరి అధ్యాయం కావచ్చు. 2025 అసెంబ్లీ ఎన్నికలు కేవలం అధికారం కోసం జరిగే మరో పోటీ కాదు. నితీశ్ కుమార్ శాశ్వతమైన, సంక్లిష్టమైన వారసత్వంపై ప్రజాభిప్రాయ సేకరణ కావచ్చు. లాలూ పాలన తర్వాత బీహార్‌లో అపూర్వ మార్పులకు శ్రీకారం చుట్టిన యువత ఆశలు ఆశయాలు, కులపరమైన పునర్వ్యవస్థీకరణల నేపథ్యంలో నితీశ్ మళ్లీ మరోసారి తమ పార్టీని నిలుపుకోగలరా అనే దానికి ఇదో పరీక్ష.

ప్రభుత్వ వ్యతిరేకత, నితిశ్ సామర్థ్యం

నితీశ్ కుమార్ దాదాపు 20 ఏళ్లుగా బీహార్‌ను పాలించారు. ఆధునిక బీహార్ రాజకీయాల్లో ఇదో రికార్డు. ఆయన పాలనలో 1990వ నాటి జంగల్ రాజ్ నుంచి రాష్ట్రం సుస్థిరత, మెరుగైన శాంతి భద్రతలు, విస్తరించిన మౌలిక సదుపాయాలతో మారింది. సుదీర్ఘకాలన ప్రభుత్వ వ్యతిరేకతను పెంచింది. ముఖ్యమంత్రి తరచు రాజకీయాల మార్పుల వల్ల -జెడి(యు) బిజెపి నుంచి మహాఘట్‌బంధన్‌కు, తిరిగి ఎన్‌డిఎకు మారడంతో ఆయనకు పాల్తూ రామ్ అన్న మారుపేరు తెచ్చిపెట్టింది. ఇది నితీశ్ ఇమేజ్‌ను, ఓటర్ల విశ్వాసాన్ని కూడా దెబ్బతీసింది. ఆయన రాజకీయ ఊగిసలాటల మధ్య పెరిగిన యువ ఓటర్లకు ఇది అస్థిరతగానే కన్పిస్తుంది. ఎన్‌డిఎలో నితీశ్ తప్పని, ఇష్టంలేని మిత్రుడుగానే కొనసాగుతున్నారు. జాతీయ స్థాయిలో ఆధిపత్యం చెలాయిస్తున్న బిజెపి ఆయనను ఆస్తిగానే కాదు అనవసరంగా నెత్తికి ఎత్తుకున్న భారంగానే భావిస్తోంది. జెడియు కుల సమతుల్యతను, పాలనపై విశ్వసనీయతను సాధించినా, ఆ పార్టీకి తగ్గుతున్న ప్రజాదరణ నితీశ్ అనంతరం మనుగడపై ప్రశ్నార్థకంగా నిలిచింది. ఇందుకు విరుద్ధంగా ఆర్‌డిఎకి చెందిన తేజస్వి యాదవ్ నాయకత్వంలోని మహాఘట్‌బంధన్, నితీశ్‌ను రాజకీయ అవకాశవాదం, పాలనా స్తబ్ధతకు చిహ్నంగా చిత్రీకరిస్తోంది. వారి కొత్తనినాదం 'నయా సోచ్, నయా బీహార్' యువతలో కొత్త ఆకర్షణ మంత్రం అయింది. యువ, సామాజిక న్యాయం ఆధారిత రాజకీయాలకు ప్రాతినిధ్యంవహిస్తున్న తేజస్వి ప్రభుత్వ వ్యతిరేకతను తరాల మార్పుగా మార్చాలని ఆశిస్తోంది.

బీహార్ రాజకీయ చిత్రంలో తరాల మార్పు

2025లో తొలిసారి ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఓటు వేస్తున్నవారిలో చాలా మంది 2005లో నితిశ్ కుమార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పుట్టినవారే. ఈ నితీశ్ తరానికి అభివృద్ధి అంటే పాలనా సంస్కరణలు, బాలికలకు సైకిళ్లు, మెరుగైన రోడ్లు కానే కావు. వారి ఆశలు, అంచనాలు వేరేగా ఉన్నాయి. ఈ ఓటర్లలో చాలామంది ఇప్పుడు నిరుద్యోగం, వలస సమస్యలు, వారి ఆకాంక్షలను తీర్చలేని విద్యా వ్యవస్థను ఎదుర్కొంటున్నారు. యువత ఆకాంక్షలను ఓట్లుగా మార్చుకోవడమే తేజస్వియాదవ్ ముందున్న సవాల్. 2020 ఎన్నికల్లో తేజస్వి 10లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానన్న హామీ అసాధ్యమని విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, యువతను ఎక్కువ ఆకట్టుకుంది. ఇప్పుడు మరింత జాగ్రత్తగా, ఉద్యోగాలతోపాటు గౌరవంగా జీవించే అవకాశం, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధితో ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు. సామాజికంగా బీహార్‌లో కులవ్యవస్థ లోతుగాపాతుకుపోయినా, దాని రాజకీయ ప్రాధాన్యతతగ్గింది. ఆర్‌జెడి సాంప్రదాయ ముస్లిం, యాదవ్ పునాది అధికారం అందుకునేందుకు చాలదు. దీంతో తేజస్వి అత్యంత వెనుకబడిన తరగతులు, మహిళలు, తొలిసారి ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు. మహాఘట్‌బంధన్ 'సామాజిక్ న్యాయ్ -2.0' నిర్మాణానికి సిద్ధమయ్యారు. పేదల ఆకాంక్షలను ఆకట్టుకునే మంత్రం కానున్నది. మరోపక్క నితీశ్ కుమార్ మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మహా దళితులలో పెంచుకున్న మద్దతుపై ఆధారపడి కొనసాగుతున్నారు. ఆయన ప్రభుత్వం చేపట్టిన 'జీవిక' నుంచి 'ఘర్ ఘర్ నల్ జల్' వరకూ సంక్షేమ పథకాలు బలమైన, విచ్ఛిన్నమైన పునాదిని సృష్టించాయని భావిస్తున్నారు. జెడి(యు) నినాదం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాశ్, సబ్ కా విశ్వాస్' బిజెపి జాతీయ సందేశాన్ని ప్రతిధ్వనిస్తోంది. అయితే నితీశ్ కుమార్ వ్యక్తిగత ప్రచారం ఇప్పటికీ గ్రామీణ బీహార్ లో బలంగా ధ్వనిస్తోంది. భద్రత, సాధికారికత పట్ల మహిళలు ఎంతో నమ్మకంతో ఉన్నారు.

అభివృద్ధి, సామాజిక న్యాయం పోటాపోటీ

అభివృద్ధి, సామాజిక న్యాయం విషయంలో రెండు కూటముల మధ్య ప్రధాన సైద్ధాంతిక అంతరం ఇప్పటికీ ఉంది. జెడి(యు), -బిజెపి కలయికను డబుల్ ఇంజిన్ సర్కార్‌గా చూపుకుంటోంది. మౌలిక సదుపాయాలు, సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. ఇందుకు తాము కొనసాగాలని కోరుకుంటోంది. రోడ్లు, విద్యుత్, నల్లాల ద్వారా నీళ్లు, మహిళా సంక్షేమం, నితీశ్ సుపరిపాలన రికార్డుపై ఎన్‌డిఎ దృష్టి పెడుతోంది. పట్టణ, సెమీఅర్బన్ ప్రాంతాలలో ప్రధాని నరేంద్ర మోడీకి గల ఆదరణ ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఇందుకు విరుద్ధంగా మహాఘట్‌బంధన్ సామాజిక న్యాయాన్నే ప్రచారాస్త్రంగా చేసుకుంది.ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాల కూటమి - నిరుద్యోగం, విద్య, కులగణన, అసమానతలనే హైలైట్ చేస్తోంది. 20 ఏళ్ల నితీశ్ పాలనలో ఎవరు ప్రయోజనం పొందారు? ఎవరు వెనుకబడ్డారని నిలదీస్తోంది? ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 2023 లో కులసర్వేను సమర్థించడం ద్వారా నితీశ్ ముందుగానే దీనిని కొంతమేరకు సాధించారు. బిజెపితో పొత్తు ఉన్నా, వెనుకబడిన తరగతులను లెక్కించడం ద్వారా సామాజిక న్యాయ ప్రమాణాలను నిలుపుకున్నారు. అయితే, ఆర్థిక పరమైన ఆందోళనల నేపథ్యంలో అది ఏమేరకు కలిసి వస్తుందో చూడాలి.

అధికార యంత్రాంగం, నితీశ్ కుమార్ టీమ్

నితీశ్ కుమార్ బలం ఆయన సర్కార్‌లో సమర్థులైన అధికారులు. వీరిలో చాలా మంది దశాబ్దాలుగా సిఎంతో కలిసి పని చేశారు. దీపక్ కుమార్, ప్రత్యయ అమృత్, సంజయ్ కుమార్ ఝా, అనుపమ్ కుమార్, విజయ్ చౌదరి వంటి వారు ఆయన పాలనలో కీలకపాత్ర వహించారు. ఈ టీం కొనసాగింపును, సామర్థ్యాన్ని నిర్ధారిస్తూనే, నితీశ్ పాలన ప్రజల రాజకీయ నాడిని పట్టుకోలేకపోతున్నదని విమర్శకులు వాదిస్తున్నారు. సాంకేతిక, డేటా ఆధారంగా సాగుతున్న పాలనపై విమర్శలు లేకపోలేదు. బీహార్ రాజకీయ వాతావరణం, వ్యక్తిత్వం మీద ఆధారపడిన నితీశ్ మోడల్ అధికారుల పాలనకు పరీక్ష ఎదుర్కొంటోంది. ఇందుకు విరుద్ధంగా తేజస్వి ప్రచారం ప్రజలపై కేంద్రీకృతమై, డిజిటల్ విస్తరణపై ఆధారపడి ఉంది.

ఓటర్ల జాబితా, ప్రత్యేక సమగ్ర సర్వే

2025 ప్రారంభంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ఫలితంగా ఓటర్ల జాబితానుంచి 69లక్షల ఓటర్ల పేర్లు తొలగించింది. దీనిని ఎన్నికల కమిషన్ ఓటర్ల శుద్ధి ప్రక్రియగా పేర్కొన్నా, రాజకీయంగా పెద్ద దుమారమే లేపింది. మహాఘట్‌బంధన్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు విరుచుకుపడ్డాయి. ముఖ్యం గా వలస, పేద బలహీనవర్గాల ఓటర్లపై కోత పడిందని అనేక పార్టీలు ఆరోపించాయి. ఈ పరిణామంతో పోలింగ్ శాతం అంచనాలపై అనిశ్చితి నెలకొంది. 2020లో బీహార్ లో 57 శాతం ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువ. నితీశ్ కు దశాబ్దాలుగా కలసివస్తున్న అంశంఇదే. ప్రస్తుతం నిరుద్యోగం, ద్రవ్యోల్బణం కారణంగా మధ్యతరగతి, గ్రామీణులను ఎన్‌డిఎకు దూరం చేస్తున్నందువల్ల మహిళలు 2025 లో నితీశ్‌కు ఏమాత్రం ప్రయోజనం చేకూరుస్తారో చూడాలి. ఎన్‌డిఎకు మరో తలనొప్పి చిన్న పార్టీలు, మాజీ ఎంపి పప్పుయాదవ్ పార్టీ, జన్ సూరజ్ పార్టీల కొత్త రాజకీయ ఫ్రంట్. ఈ కూటమి ఓట్లు చీల్చడంలో కీలక భూమిక నిర్వహించవచ్చు.

కూటమి లెక్కలు, అంతర్గత వైరుధ్యాలు

ఎన్‌డిఎలో బిజెపి బీహార్‌లో స్వతంత్రంగా ఎదగాలన్న ఆశయానికి నితీశ్ నుంచి బ్రేక్ తప్పడం లేదు. 2020లో సీట్ల పంపకాల చర్చల్లోనే కీచులాటలు వచ్చాయి. 2024లో లోక్‌సభ విజయం నేపథ్యంలో బిజెపి సింహభాగాన్ని కోరుతోంది. 2010 తర్వాత జెడియుకి తగ్గుతున్న సీట్ల సంఖ్య, ఎన్నికల్లో పేలవ ప్రదర్శన నితీశ్ పార్టీని జూనియర్ పార్ట్ నర్ చేయవచ్చు.

# ఢిల్లీ విమానాశ్రయంలో తప్పిన ముప్పు

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా బస్సు దగ్ధమైంది. విమానాశ్రయం మూడో టెర్మినల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాక సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాక్సీయింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన విమానానికి అత్యంత సమీపంలో ఈ ఘటన జరిగినప్పటికీ ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రౌండ్ హ్యాండిలర్స్‌కు చెందిన బస్సు మధ్యాహ్నం సమయంలో మంటల్లో చిక్కుకుందని, అయితే ఏఆర్ఎఫ్ఎఫ్ నిపుణుల బృందం రెండు నిమిషాల్లోనే మంటలను అదుపు చేసిందని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో తెలియజేసింది. ఘటన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ నష్టం జరగలేదని తెలిపింది. విమాన సర్వీసులు యథాప్రకారం నడుస్తున్నాయని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది.

# డాక్టర్ ఆత్మహత్య కేసులో కొత్త విషయాలు

ముంబై,మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న మహిళా డాక్టర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యురాలి ఆత్మహత్య కేసును కొలిక్కి తీసుకొచ్చేం దుకు పోలీసులకు కీలకమైన ఆధారాలు లభించాయి. ఎస్సై గోపాల్ బదానే తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ అరచేతిపై సూసైడ్ నోట్ రాసి ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మరికొన్ని ఆధారాలు దొరికాయి.డాక్టర్ ఆత్మహత్యకు కారణమని భావిస్తున్న ప్రశాంత్ బంకర్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో ఆమె ఎప్పటి కప్పుడు మెసేజ్‌లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. డాక్టర్ సూసైడ్ చేసుకోవడానికి ముందు మానసికంగా చాలా కుంగిపోయి చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ ఇంట్లో మహిళా డాక్టర్ పూజకు హాజరయ్యిందని.. కానీ అక్కడ గొడవ జరిగిన తర్వాత ఆమె అక్కడినుంచి వెళ్లి హోటల్‌లో చేరి, తీవ్ర మనోవేదనతో ఉరి వేసుకొని చనిపోయిందని తెలిపారు. సతారా పోలీసు విభాగానికి చెందిన ఎస్సై గోపాల్ బదానే పలుమార్లు తనపై లైంగిక దాడి చేశాడని ఇప్పటికే ఆమె సూసైడ్ నోట్ లో తెలిపింది. మరో వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ మానసికంగా వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు వీరిద్దరినీ అరెస్ట్ చేయగా.. కేసు విచారణ కొనసాగు తుంది. మహారాష్ట్ర మహిళా సంఘం చైర్‌పర్సన్ రూపాలి చకాంకర్ మాట్లాడుతూ.. బంకర్ ఇంట్లో వైద్యురాలు లక్ష్మీ పూజకు హాజరై, అక్కడ ఫోటోలు తీసుకునే విషయంలో గొడవలు జరిగాయని తెలిపారు. తర్వాత డాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయిందని.. బంకర్ తండ్రి ఆమెను తిరిగి తీసుకురాగానే, ఆమె మరోసారి హోటల్‌కు వెళ్లిపోయిందని చెప్పారు. ఇదే విషయాన్ని పోలీసు అధికారి తుషార్ దోషి కూడా ధృవీకరించారు.

# ప్రజల్లో సంతృప్తి

హైదరాబాద్,దశాబ్దాల నాటి సమస్యలకు గంటల్లో, రోజుల్లో పరిష్కారం చూపుతోందంటూ పలువురు తమ పనితీరును ప్రశంసిస్తున్నారని హైడ్రా స్పష్టం చేసింది. కబ్జాలు జరుగుతుంటే నగర ప్రజలు చూస్తూ ఊరుకోవడంలేదని.. నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారని తెలిపింది. సోమవారం ప్రజావాణికి 52 ఫిర్యాదులందాయని పేర్కొంది. త్వరితగతిన పరిష్కారం లభిస్తున్నందువల్లే ఫిర్యాదులు చేస్తున్నారని వివరించింది. చాలామంది బాహాటంగా ఫిర్యాదు చేస్తున్నారని.. మరి కొంతమంది తమ వివరాలు బయటపెట్టవద్దని అధికారులకు సూచిస్తున్నారని తెలిపింది. కూకట్‌పల్లిలోని హస్మత్‌పేట గ్రామంలో ప్రభుత్వానికి చెందాల్సిన 10 ఎకరాలు కబ్జా చేసేస్తున్నారంటూ తమకు ఫిర్యాదు అందిందని హైడ్రా స్పష్టం చేసింది. తూములు మూసేసి, అలుగులు ఎత్తు పెంచడంతో చెరువు పై భాగంలో ఉన్న భూములు, లే ఔట్‌లు నీట మునగుతున్నాయని కొంతమంది కంప్లైట్ చేసినట్లు తెలిపింది. మరికొంత మంది చెరువుల్లో మట్టి పోసి ఎకరాలకొద్దీ కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు వివరించింది. ఈ ఫిర్యాదులను కమిషనర్ రంగనాథ్ నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పజెప్పారని తెలియజేసింది. శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామం పరిధిలోని సరసింహకుంట తూములు మూసేసి.. అలుగు ఎత్తు పెంచడం వల్ల ఎఫ్‌టీఎల్ కంటే ఎక్కువ నీరు నిలిచి తమ పంట పొలాలు మునిగిపోయాయని ఆ గ్రామ ప్రజలు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ, మండలంలోని బీరంగూడలో ఉన్న శాంబుని కుంట కబ్జాలకు గురి అవుతోందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సాగర్‌రోడ్డులో ఉన్న యశోదనగర్ కాలనీలో శివారు ఇంటి స్థలాల వారు రోడ్డును కలిపేసుకుని దారి లేకుండా చేస్తున్నారని యశోదనగర్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలో పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రి మట్టిపోసి నింపుతున్నారని.. నంబరు ప్లేటు లేని వాహనాలను వినియోగిస్తున్నారని అక్కడి నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువులోకూడా మట్టిపోసి.. భవన నిర్మాణాలు చేపడుతున్నారని.. అడ్డుకున్న తమపై దాడి చేయడమే కాకుండా.. స్థానిక పోలీసు స్టేషన్లో కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు కంప్లైంట్ చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ మండలం, హస్మత్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు హైడ్రా ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు.

# కేంద్రానికి దివాళాకోరు విధానం

విజయవాడ,ఎల్ఐసిలోని వేల కోట్ల రూపాయలను అదానీకి అప్పనంగా అప్పగించిన కేంద్ర ప్రభుత్వ దివాళాకోరు ఆర్థిక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి బి గోపీమూర్తి పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, ప్రజాధనాన్ని కాపాడాలని, కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అమెరికా వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం ఎల్ఐసి ధనం రూ.33 వేల కోట్లు అదానీ కంపెనీకి చెల్లించేందుకు జరిగిన చర్చల వివరాలు వెలుగులోకి రావడం దేశ ప్రజలను ఆందోళన గురిచేస్తోందన్నారు. ప్రజలు మౌనంగా ఉంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని, పోరాటంతోనే హక్కులను, ఆస్తులను కాపాడు కోవచ్చని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 15 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు ప్రజలను ఒప్పించి ఎల్ఐసిలో ఖాతాదారులుగా మార్చడం ద్వారా సృష్టించిన సంపదపై కార్పొరేట్ల కన్ను పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరిలోనే అదాని గ్రూపు కంపెనీలో ఎల్ఐసి పెద్ద మొత్తంలో

# సర్ కి సలాం కొట్టలేం !



కేరళ:సర్ అంటే దేశంలోని విపక్షానికి చిర్రెత్తుకుని వస్తోంది. సర్ అన్నది షార్ట్ కట్ పదం. ఇది మర్యాదపూర్వకంగా ఇంగ్లీష్ లో అనిపించినా సర్ కి అసలైన అర్థం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ . కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా 12 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో సర్ ని అమలు చేయడానికి రెడీ అయిపోతోంది. ఆ వివరాలు అన్నీ కూడా కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ ఢిల్లీలో మీడియా ముందు వెల్లడించారు. ఇక ఈసీ రెండవ విడతలో భాగంగా సర్ ని అమలు చేయబోయే రాష్ట్రాల జాబితాలో కేరళ కూడా ఉంది. అదే విధంగా కేరళకు కూడా 2027లో ఎన్నికలు ఉన్నాయి దాంతో ప్రస్తుతం కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ కూటమి సర్ మీద కారాలూ మిరియాలూ నూరుతోంది.

ప్రజాస్వామ్యానికే పెను ముప్పు :

దేశంలో రెండో విడతగా అమలు చేయబోతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ అన్నది ప్రజాస్వామ్యానికి పెను ముప్పు అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఘాటుగా స్పందించారు. కేరళతో పాటు ఇతర రాష్ట్రాలలో దీనిని చేపడతామని ఈసీ ప్రకటించిన కొద్ది గంటలలోనే ఆయన నుంచి పూర్తి వ్యతిరేకతతో ప్రకటన విడుదల అయింది. ఈ విధంగా ఈసీ కనుక వ్యవహరించ దలచుకుంటే అది ఈసీ ఉనికి మీదనే సరికొత్త సందేహాలకు కారణం అవుతుందని కూడా ఆయన అంటున్నారు. అదే విధంగా దేశంలో ఎన్నికల వ్యవస్థ మీదన కూడా జనాలలో ఎన్నో అనుమానాలకు పూర్తి స్థాయిలో తావిస్తుందని కూడా పినరయి విజయన్ అంటున్నారు. ప్రజల విశ్వాసాన్ని దీబ్బతీస్తుందని గుర్తుంచుకోవాలని ఆయన ఘాటుగానే హెచ్చరించారు.

నిబంధనలకు పాతర :

ఈసీ చెబుతున్న దానిని బట్టి చూస్తే 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం అలాగే 1960 నాటి ఓటర్ల జాబితా సవరణలకు వాటి నిబంధనలకు పూర్తి స్థాయిలో ఉల్లగించడమే అని కూడా విజయన్ అన్నారు. సర్ పేరుతో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాకు బదులుగా 2002 నుంచి 2004 వరకూ ఉన్న ఓటర్ల జబితాల ఆధారంగా సవరణ చేయడానికి ఈసీ సన్నాహాలు చేస్తోంది అని కేరళ ముఖ్యమంత్రి విమర్శిస్తున్నారు. దీనిని ఎవరూ అంగీకరించే ప్రసక్తి ఉండదని ఆయన స్పష్టం చేస్తున్నారు.

అదే కరెక్ట్ విధానం :

ఎక్కడైనా అమలు అయ్యే విధానం ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాను మరింతగా నవీకరణ చేయడం అని ఆయన గుర్తు చేస్తున్నారు చట్టాలు కూడా పూర్తి క్లారిటీగా అదే విషయం చెబుతున్నాయని ఆయన అంటున్నారు. ఆ విధంగానే ఈసీ వ్యవహరించాలని ఆయన సూచించారు. ఇక చూస్తే కేరళలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు ఆ సమయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ని అమలు చేయడం అన్నది అసాధ్యమని విజయన్ అన్నారు.ఇదే విషయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారి ఇప్పటికే ఈసీకి తెలియచేశారని అయినా కూడా ఈసీ సర్ ని అమలు చేస్తామని చెప్పడం మీద ముఖ్యమంత్రి మండిపడుతున్నారు. ఇవన్నీ చూస్తూంటే ఏకంగా ఈసీ వ్యవహరిస్తున్న తీరు మీదనే పూర్తి స్థాయిలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని విజయన్ అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఈసీ దేశంలో రెండో విడతగా అమలు చేయాలనుకుంటున్న సర్ అంత సులువుగా కనిపించడం లేదు అని అంటున్నారు. మరి ఏ విధంగా ఈసీ అమలు చేస్తుందో చూడాలి ఉంది.

# బంగ్లా చేసిన పిచ్చి పని...భారత్ ఆగ్రహం

న్యూఢిల్లీ,భారతదేశం ఎంతో సహన వంతమైన దేశంగా చెప్పుకుంటారు. అందరూ బాగుండాలి అందులో తాను ఉండాలని నమ్మే దేశంగా ప్రపంచంలో పేరుంది. విశ్వానికి మిత్రుడు అన్న పదం ఒక్క భారత్ కే సరిపోతుంది. శతృవు అన్న మాట భారత్ వైపు నుంచి ఉండదు, తమ జోలికి ఎవరైనా వస్తేనే మూడో కన్ను తెరుస్తుంది. పాక్ దాయాదిగా ఉంటూ శత్రువుగా మారినా కూడా భారత్ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. మారాలని కోరింది అయినా వినిపించుకోక తన బుద్ధి చూపించుకోగ్వడంతోనే ఆపరేషన్ సింధూర్ లాంటి గట్టి ప్రయోగం చేయాల్సి వచ్చింది. అలాగే సింధు జలాలను నిలుపు చేసి పాక్ గొంతు ఎండబెట్టాల్సి వచ్చింది.

ఊపిరి పోసిన చోట :

ఇక మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ గురించి చెప్పాలంటే ఆ దేశం ప్రతీ రోజూ భారత్ పేరు తలచుకోవాల్సిందే అని అంటారు. ఒక్కసారి చరిత్ర పుటల్లోకి వెళ్తే కనుక పాక్ కబంధ హస్తాల నుంచి తూర్పు పాకిస్తాన్ ని కాపాడి ఒక ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేసిన మంచితనం భారత్ ది అని చెబుతారు. తూర్పు పాకిస్తాన్ ని అలా కనుక వదిలేసి ఉంటే ఈ రోజున బెలూచిస్తాన్ మాదిరిగా అన్ని విధాలుగా అణచివేతకు గురి అయి పాక్ చేతిలో హింస పడుతూ దిన దిన గండంగా ఉండేది. అంతకు ముందు కూడా మొదటి మూడు దశాబ్దాల పాటు అలాగే తూర్పు పాకిస్తాన్ హింసకు గురి అయింది భారత్ ని శరణు కోరడంతో న్యాయ సమ్మతంగా అది ఉండడంతో భారత్ శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో పాక్ తో యుద్ధం చేసి 1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావానికి నాంది పలికింది. ఒక కొత్త దేశం ప్రపంచ పటం మీద ఊపిరి పోసుకోవడానికి దోహదదం అయింది. అంతటితో ఊరుకోలేదు నిన్నా మొన్నటి వరకూ ఆర్థికంగా అన్ని విధాలుగా బంగ్లాదేశ్ ని ఆదుకుంటూనే వచ్చింది. కానీ గత ఏడాదిన్నరగా మారిన పరిణామాలతో బంగ్లాదేశ్ భారత్ కి శతవుగా మారిపోయింది.

విషం చిమ్ముతూ :

తన ఒకనాటి శత్రువు అయిన పాక్ తో చేతులు కలిపి భారత్ మీద విషం చిమ్మడం తో పోటీ పడుతోంది బంగ్లాదేశ్. ఆ దేశం తాజాగా చేసిన పిచ్చి పనికి భారత్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పాక్ కి టెంపరరీగా ఒక ప్రధాని ఉన్నారు. ఆయనే మహమ్మద్ యూనస్. ఆయన భారత్ మీద అదే పనిగా తన వ్యతిరేకతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా ఈ పెద్ద మనిషి ఇంకో సారి భారత్ పై తనకు ఉన్న అసూయను వ్యతిరేకతను చాటుకున్నారు. భారత్ కు చెందిన కీలకమైన భూభాగాలను బంగ్లాదేశ్ దేశం మ్యాప్ లో ఆయన



చూపించారు. ఇది ఒక విధంగా బరితెగింపు అని చెప్పాల్సి ఉంటుంది. అంతే కాదు చాలా గొప్పగా దానిని పాక్ నేస్తాలకు బహూకరించారు.

పెద ధోరణికి :

ఇదంతా బంగ్లాదేశ్ పెద ధోరణికి నిదర్శనం అని అంటున్నారు తమది కానిది తమకు చెందనిది అయిన భూములను ప్రాంతాలను ఎలా కలుపుకుంటారు అని భారత్ లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇది దిగజారుడు తనం చౌకబారుతనం బరితెగింపు అని అంటున్నారు. ఈ విధంగా తయారు చేసిన మ్యాప్ ని ఆయన పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు ఇవ్వడం మరో రకమైన పైత్యానికి నిదర్శనంగా చూస్తున్నారు. ఇక బంగ్లా ఈ విధంగా రూపొందించిన మ్యాప్ లో చూస్తే భారత దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు అన్నీ ఉండడం గమనార్హం. వాటిని తమ సొంతంగా సొత్తుగా బంగ్లా తాత్కాలిక పాలకుడు చూపించుకుంటూ మురిసిపోవడం కంటే తెంపరితనం వేరొకటి ఉండదని అంటున్నారు

బంగ్లాకు తగిన గుణపాఠం :

ఈ మధ్యనే పాకిస్థాన్ కు చెందిన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్ పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా బంగ్లాదేశ్ లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగానే ఆయనకు ఈ తాత్కాలిక ప్రధాని అయిన యూనస్ మహాశయుడు ఒక బుక్ ని ప్రజెంట్ చేశారు. ఆ బుక్ కి వేసిన కవర్ పేజి చిత్రంలో భారత్ లోని భూభాగాలను కలుపుకుంటూ ఉన్న మ్యాప్ లో ఉంది. భారత్ లో ఈశాన్యంలో ఏకంగా ఏడు రాష్ట్రాలు మావే అంటూ చేసిన ఈ మ్యాప్ ప్రదర్శన బంగ్లా బుద్దిని బయట పెట్టింది. అంతే కాదు పిచ్చి తనాన్ని బయటపెట్టింది అని అంటున్నారు. దీని మీద మొత్తం భారతదేశం ఆగ్రహంగా ఉంది. సమయం చూసి భారత్ బంగ్లాకు తగిన గుణపాఠం చెప్పాలని అంతా కోరుకుంటున్నారు.

# పత్తి రైతులకు శుభవార్త...

అమరావతి, రాష్ట్రంలో పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. బుధవారం నుంచే పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకానున్నాయి. పత్తి కనీస మద్దతు ధర రూ. 8,100గా నిర్ణయించారు. రాష్ట్ర రైతాంగానికి ఉపశమనం కల్పించేలా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు నేటి నుంచి ప్రారంభించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మొంథా తుపాను తీవ్రత నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 కొనుగోలు కేంద్రాలలో తక్షణమే పత్తి సేకరణ చేపట్టాలని సీసీఐ, సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ సంవత్సరానికి 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు అయింది. సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావొచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలుకు రూ. 8,110/ – కనీస మద్దతు ధరను రైతులకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పత్తి అమ్ముకోవాలనుకునే రైతులు కొనుగోలు ప్రక్రియను సక్రమంగా పాటించాలని సూచించారు. రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా తమ వివరాలను సీఎం యాప్‌లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆ తర్వాత 'కపాస్ కిసాన్' యాప్‌లో అదే వీఏఏ సహాయంతో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ ప్రకారం సీసీఐ నిర్దేశిరచిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు కేంద్రాల ద్వారా మాత్రమే పత్తిని అమ్ముకోవాలని మంత్రి కోరారు. ఇందు కోసం జిల్లా వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ అధికారులు దిగువ స్థాయి సిబ్బందికి తగు సూచనలు



ఇస్తూ వీఏఏలు రైతులకు పూర్తి సహకారం అందించేలా పర్యవేక్షించాలన్నారు. పత్తి కొనుగోలును విజయవంతంగా పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. మొంథా తుపాను నేపథ్యంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఇంతకంటే పెద్ద ఉపద్రవాలను పక్కా ముందస్తు ప్రణాళికతో, పకడ్బందీ ఏర్పాట్లతో విజయవంతంగా అధిగమించగలిగామన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలను, అధికారులను, కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. తుపాను కారణంగా రైతులు నష్టపోతే.. పూర్తిగా ఆదుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.

# అంతర్జాతీయంగా ట్రేడ్ మార్పులు..పెరిగిన బంగారం ధరల్లో తగ్గుదల



హైదరాబాద్, దీపావళి సమయంలో ఉవ్వెత్తున ఎగసిన పసిడి ధర దిగొచ్చింది. అంతర్జాతీయ పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాలతో దిద్దుబాటుకు గురైంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4 వేల డాలర్ల స్థాయి దిగువకు చేరింది. అమెరికా– చైనా మధ్య త్వరలో ట్రేడ్ డీల్ కుదరొచ్చన్న అంచనాలు ఈ కరెక్షన్‌కు కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న జరిగే భేటీలో ఆ మేర కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో పుత్తడికి డిమాండ్ తగ్గినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఇటీవలి వరకూ చుక్కలనంటిన పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. మంగళవారం కూడా పసిడి, వెండి ధరల్లో తగ్గుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ. 820 మేర తగ్గి రూ. 1,22,460కు చేరుకుంది. ఇక ఆర్నమెంటల్ బంగారం ధర రూ. 750 మేర తగ్గి 1,12,250కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా భారీ కోత పడింది. కిలో వెండి ధర సుమారు రూ. 4 వేల మేర తగ్గి రూ. 1,51,000కు చేరుకుంది. ఇక హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ. 1,22,460గా ఉంది. ఆర్నమెంటల్ బంగారం ధర రూ. 1,12,250గా ఉంది. కిలో వెండి ధర మాత్రం రూ. 1.65 లక్షలుగా ఉంది. ఇక అంతర్జాతీయ మార్కెట్ లోనూ పసిడి ధరల్లో భారీ తగ్గుదల కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ బంగారం 3986 డాలర్ల వద్ద కొనసాగు తోంది. నిన్నటితో పోలిస్తే సుమారు 3 శాతం మేర ధరల్లో కోత పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌లో గోల్డ్ డిసెంబర్ ఫ్యూచర్స్ ధర కూడా 2.35 శాతం మేర తగ్గి రూ. 1,20,546 వద్ద కొనసాగుతోంది. మలేషియా వేదికగా అమెరికా, చైనా ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సానుకూల ఫలితాలను ఇచ్చాయి. ఎగుమతుల పై నియంత్రణలు, డ్రగ్స్ కట్టడి, షిప్పింగ్ లెవీల వంటి వాటిపై ఇరు దేశాల మధ్య ప్రాథమిక స్థాయిలో ఏకాభిప్రాయం కుదరడంతో బంగారానికి డిమాండ్ తగ్గింది. టిక్‌టాక్ విక్రయంపై భేదాభిప్రాయాలు తొలగిపోయాయని, చైనాపై 100 శాతం సుంకం కూడా ఉండబోదని అమెరికా ట్రెజరీ సెక్రటరీ బెసెంట్ ప్రకటించడంతో మళ్లీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు ఆకర్షణీయంగా మారాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గడం కూడా మదపర్లకు కొత్త ఊపునిచ్చింది.

# కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా



హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై బీఆర్ఎస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ప్రతిగా నవీన్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులకి గట్టి సవాల్ విసిరారు. తన మీద పెట్టిన కేసులు నిజమైతే తాను రాజకీయాలని వదిలి.. హైదరాబాద్ విడిచి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. కానీ ఆ కేసులు ఫాల్స్ అని తేలితే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రభుత్వం తనపై, తన కుటుంబ సభ్యులపై, అనుచరులపై ఒకే సంవత్సరంలో 20 నుంచి 30 తప్పుడు కేసులు పెట్టిందని ధ్వజమెత్తారు. తన మీద రౌడీ అని ప్రచారం చేయడంపై బీఆర్ఎస్ నేతల కుట్ర ఉందని విమర్శించారు నవీన్ యాదవ్. తనకు న్యాయవ్యవస్థ నమ్మకం కలిగించిందని.. తనను కాపాడిందని ఉద్ఘాటించారు. అలాగే, కాంగ్రెస్ ప్రచార రథాన్ని తగులబెట్టే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కూడా కేసు నమోదైందని తెలిపారు. పోలీసులు ఈ విషయంపై చర్య తీసుకుంటారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పైన విశ్వాసం ఉంచారని నవీన్ యాదవ్ నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

# బీహార్‌లో ఇంటికో ఉద్యోగం..అధికారంలోకి రాగానే అమలు

పాట్నా, బిహార్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విపక్ష మహాగట్‌బంధన్ మంగళవారం నాడు విడుదల చేసింది. 'బిహార్ కా తేజస్వి ప్రణ్ పత్ర'అనే టైటిల్‌తో ఆర్జేడీ నేత, కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. 'నూతన, అభివృద్ధి చెందిన బిహార్' తమ విజన్ అంటూ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టో వాగ్దానం చేసింది. 20 రోజుల్లో ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తెలిపింది. జీవికా దీదీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని ప్రకటించింది. కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పెర్మనెంట్ చేస్తామని, పాత పెన్షన్ పథకాన్ని తిరిగి తీసుకువస్తామని తెలిపింది. రైతులు పండించిన పంటలన్నింటికీ కనీస మద్దతు ధర ఇస్తామని, మండీ, మార్కెట్ కమిటీలు పునరుద్ధరిస్తామని పేర్కొంది. జన్ స్వాస్థ్య సురక్ష యోజన కింద ప్రతి ఒక్కరికీ రూ. 25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తామని, జనాభాకు అనుగుణంగా 50 శాతం రిజర్వేషన్‌ను పెంచుతామని హామీ ఇచ్చింది. తేజస్వి యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్డీయే నేతల ప్రసంగాలు వినే ఉంటారని, ఒక్క నేత కూడా బీహార్‌ను ఎలా ముందుకు తీసుకువెళ్తారో చెప్పడం లేదని అన్నారు. నితీష్‌కుమార్‌ను ఎన్డీయే కీలుబొమ్మగా పేర్కొన్నారు. బిహార్ సీఎం నితీష్‌కుమార్‌ను ఎన్నికల కోసమే బీజేపీ వాడుకుం టోందని, నితీష్ బిహార్ సీఎం కారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పటికే ధ్రువీకరించారని, ఎన్నికల తర్వాత బీజేపీ నితీష్‌ను సీఎం చేసే ప్రసక్తే లేదని అన్నారు. ఇండియా కూటమి తనను సీఎం అభ్యర్థిగా ప్రకటించిందని, కానీ ఎన్డీయే ఒక్క మీడియా సమావేశంలో కూడా తమ సీఎం అభ్యర్థి ఎవరో ప్రకటించలేదని అన్నారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాగట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగా తామే ప్రకటించామని, ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోను కూడా మొదటగా తాము విడుదల చేశామని చెప్పారు. దీనిని బట్టే బిహార్ విషయంలో తామెంతో కృతనిశ్చయంతో ఉన్నామో అర్థం చేసుకోవచ్చన్నారు. తొలి రోజు నుంచి బిహార్‌కు ఏమి చేయదలచుకున్నామో డిసైడ్ చేసుకున్నామని, బిహార్‌కు తిరిగి పట్టాలపైకి తీసుకువస్తామని చెప్పారు. మహాగట్‌బంధన్ 'ప్రాణ పత్ర' కోసం బిహార్ రాష్ట్రం ఎదురుచూస్తోందని, ఈరోజు తమకు శుభదినమని అన్నారు. మహాగట్‌బంధన్ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థి,



వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ ముఖష్ సహానీ మాట్లాడుతూ, నవీన బీహార్ కోసం సంకల్ప పత్రాన్ని ఈరోజు విడుదల చేశామని, రాబోయే 30–35 సంవత్సరాల పాటు బిహార్ ప్రజలకు సేవలందిస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను తాము నెరవేరుస్తామని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్ర ప్రజలంతా మహాగట్‌బంధన్‌కు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. ఎన్డీయేకు ఎలాంటి సంకల్పం లేదని, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని హాగట్‌బంధన్ ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

విజయవాడ, మొంథా తుపాను ప్రభావంతో విజయవాడలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. నగరంలో 16.2 సెం.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. తీవ్రత ఎక్కువగా ఉంటే దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ షాపులు, కూరగాయలు, పాల విక్రయ దుకాణాలు తెరుచుకోవచ్చని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 41 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొండపై నివసిస్తున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్, వీఎంసీ ప్రధాన కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

# తెలంగాణలో పత్తాలేని పీఆర్సీ...

హైదరాబాద్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు 8వ పే కమిషన్‌ను కేంద్రం మంగళవారం నియమించింది. తెలంగాణలో మాత్రం పీఆర్సీ పత్తాలేకుండా పోయింది. ఆరు నెలల్లోపు కొత్త పీఆర్సీ ప్రకటిస్తామన్న కాంగ్రెస్ గ్యారెంటీ గాలిలో కలిసింది. అసలు పీఆర్సీపై సర్కారులో ఇసుమంతైనా కదలిక లేకపోవడం విచారకరమని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ తొలి పీఆర్సీ గడువు 2023, జూన్ 30తో ముగియగా, అదే ఏడాది జూలై ఒకటి నుంచి రెండో పీఆర్సీని వర్తింపజేయాల్సి ఉన్నది.కాగా కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్ శివశంకర్ చైర్మన్‌గా, రిటైర్డ్ ఐఏఎస్ బీ రామయ్య సభ్యుడిగా రెండో పీఆర్సీ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆరు నెలల్లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించాల్సి ఉండగా, 2024 ఏప్రిల్ 2తో ఆ కమిటీ గడువు ముగిసింది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కారణంగా కమిటీ గడువును ఆరునెలలు పొడిగించారు. ఈ అక్టోబర్ రెండుకు పీఆర్సీ కమిటీని నియమించి రెండేండ్లు పూర్తయ్యింది. ఈ పీఆర్సీ కమిటీ ఉద్యోగ సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. ఉద్యోగ సంఘాల నేతలు 51 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని కమిటీ ముందు ప్రతిపాదించారు.

పీఆర్సీ ఇవ్వడం ఇష్టంలేక..



వాస్తవానికి పీఆర్సీ కమిటీ ఎప్పుడో సమగ్ర నివేదికను రెడీ చేసింది. ఈ నివేదికను సమర్పించేందుకు ప్రభుత్వ అనుమతి కోరింది. కానీ ఇందు కు ప్రభుత్వం అనుమతించడం లేదు. ఒకశాతం ఫిట్‌మెంట్ ప్రకటించినా.. నెలకు రూ. 200 కోట్లు ఉద్యోగులకు అందుతాయి. అయితే ఉద్యోగులు 50% ఫిట్‌మెంట్ అడుగుతున్నారు. తక్కువలో తక్కువగా 25% ఫిట్‌మెంట్ ప్రకటించినా నెలకు రూ. 5 వేల కోట్ల చొప్పున అందుతాయని ఉద్యోగ సంఘాలు అంటున్నాయి. పీఆర్సీ నివేదికను స్వీకరిస్తే బంతి సర్కారు కోర్టులోకి చేరుతుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com